మాట్లాడుతున్న వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

వైద్యులకు సేవాభావం అవసరం

ఐఎంఏ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సమావేశంలో మంత్రి సత్యకుమార్

ధర్మవరం, న్యూస్‌టుడే: వైద్యవృత్తి పవిత్రమైనదని, వ్యాపార దృక్పథంతో కాకుండా సేవాభావం కలిగి ఉండాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ పేర్కొన్నారు. ఆదివారం ధర్మవరంలో ఇండియన్ మెడి కల్ అసోసియేషన్ వర్కింగ్ కమిటీ సమావేశం స్థానిక విష్ణుప్రియ కన్వెన్షన్ హాలులో నిర్వహించారు. ముఖ్య అతిథిగా మంత్రి సత్యకుమార్ యాదవ్ పాల్గొన్నారు. వైద్యుల సమస్యలను ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం. జయచంద్రనాయుడు, జనరల్ సెక్రెటరీ ఫణిధర్ మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు 175 నియోజకవర్గాల్లోనూ మల్టీ స్పెషాలిటీ ఆసుప త్రులు 100 పడకలతో నిర్మాణం చేపట్టేందుకు సీఎం చంద్రబాబు చిత్తశు ద్ధితో ఉన్నారన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో ఆసుపత్రుల నిర్మాణం చేపట్టి మెరుగైన వైద్యసేవలు ప్రజలకు అందించే ప్రయత్నం చేస్తా మన్నారు. కొందరు వైద్యులు అవసరం లేని మందులు, పరీక్షలు చేయిస్తు న్నారని, దీనివల్ల ఆసుపత్రులకు వచ్చేవారికి ఆర్థికభారం పడుతోందన్నారు. వైద్యులపై దాడుల నివారణకు కొత్త ఆర్డినెన్స్ తీసుకువస్తామని చెప్పారు. అనంతరం ఐఎంఏ ఆధ్వర్యంలో మంత్రిని ఘనంగా సన్మానించారు. సమా వేశంలో ఐఎంఏ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శి డాక్టర్ జయచంద్రనాయుడు, డాక్టర్ ఫణిధర్, ఐఎంఏ ప్రతినిధులు డాక్టర్ నందకిషోర్, డాక్టర్ రవికృష్ణ, డాక్టర్ జయకుమార్, డాక్టర్ వాసుదేవరెడ్డి, వైద్యులు పాల్గొన్నారు.

పశ్చిమ మండలాల్లో వర్షం



అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: జిల్లాలో వర్షం అక్కడక్కడ కురుస్తునే ఉంది. చాలా మండలాల్లో వర్షం లేక పంటలన్నీ ఎండుతున్నాయి. గ్రాసం కూడా దక్కదన్న అన్నదాతలు ఆందోళనలో ఉన్నారు. ఆదివారం ఉదయం పలు మండలాల్లో వర్షం కురిసింది. ఆతర్వాత ఎండ వేడిమితో జన మంతా తల్లడిల్లారు. వానలు వస్తాయని వాతావరణశాఖ సంకేతాలు ఇచ్చింది. శని వారం రాత్రి జిల్లాలో పశ్చిమ మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. ఈనెల సాధారణ వర్షపాతం 110.9 మి.మీలు కురవాల్సి ఉండగా 44.2 మి.మీలు (29వ తేదీ నాటికి) లోటు వర్షపాతం నమోదైంది. బ్రహ్మసముద్రం మండలంలో 28.0 మి.మీలు అత్యధికంగా వర్షం కురిసింది. కళ్యాణదుర్గంలో 25.2, గుమ్మఘట్టలో 24.6, శెట్టూరులో 24.2, రాయ దుర్గంలో 15.2, వజ్రకరూరులో 14.2 మి.మీల వర్షం కురిసిందని జిల్లా ముఖ్య ప్రణాళికాధి కారి అశోక్‌కుమార్ తెలిపారు.

వైకాపా అండదండలుండటంతో..

అధికారం అండగా అడ్డంగా మేసేశారు..

- రూ.72 లక్షల స్వాహాలో తేలిన లెక్క
- ఐదేళ్లు నిద్ర నటించిన అధికారులు

అనంత నంక్షేమం, న్యూస్‌టుడే: పొదుపు మహిళలు శ్రమకోర్చి రూపాయి రూపాయి కూడబెట్టి చెల్లించిన నగదును యానిమేటర్, ఆమె భర్త పప్పు బెల్లంలా అడ్డంగా మేసేశారు. ఒకే గ్రామంలో లక్షల రూపాయల్లో నిధులు స్వాహా అవుతున్నా.. ఐదేళ్ల వైకాపా పాలనలో అధికారులు నిద్ర నటించడంపై విమర్శలు వెల్లువెత్తు తున్నాయి. కళ్యాణదుర్గం మండలం మల్లికార్జునపల్లిలో ఒకే గ్రామంలోనే ఏకంగా రూ.72,41,307 మహిళల సొమ్ము స్వాహా చేసినట్లు అధికారి కంగా లెక్క తేలింది. 2019 నుంచి మహిళలు అప్పుగా తీసుకున్న సొమ్మును కంతులవారీగా చెల్లిం చగా బ్యాంకులో కట్ట కుండా స్వాహాకు తెర లేపారు. ఐదేళ్ల వైకాపా హయాంలో అధికారులు ఏ మాత్రం పట్టించుకో లేదు. స్వాహా పర్వంలో యానిమేటర్ లక్ష్మీనర సమ్మ, ఆమె భర్త ఎర్రిస్వామిల పాత్ర ఎక్కువగా ఉన్నట్లు ఇటీవల డీఆర్‌డీఏ-వెలుగు అధికారుల బృందం క్షేత్రస్థాయిలో పరిశీలించి రికార్డులు, బ్యాంకు లావాదేవీల అనంతరం గుర్తించింది.

స్వాహా చేసిన సొమ్ము లెక్క ఇదీ..

పద్దు	స్వాహా (రూ.ల్లో)
బ్యాంకు లింకేజీ	48,09,493
స్త్రీనిధి	18,85,282
సంఘం పొదుపు	2,68,864
సంఘాల నిధులు	1,81,000
సీఐఎఫ్	50,000
ఉన్నతి	46,668

తేల్చింది II సంఘాలవే..

మల్లికార్జునపల్లిలోని నరసింహస్వామి గ్రామ సమాఖ్యలో మొత్తం 22 సంఘాలు ఉన్నాయి. ఆయా సంఘా లకు స్త్రీనిధి నిధులు మంజూరు చేశారు. నెలనెలా బకాయి తీసుకున్న సొమ్మును బ్యాంకులో చెల్లిస్తున్నా సకాలంలో రుణం చెల్లించలేదని తేలింది. ఒకే నెలలో ఏకంగా రూ.5,13,158 చెల్లించలే దని ఎన్‌పీఏ ఆన్‌లైన్‌లో చూపించ డంతో డీఆర్‌డీఏ వెలుగు బృందాలు విచారించడంతో తీగలాగితే డొండ కది లినట్లు స్వాహా సొమ్ము తేలింది. ఇంకా బహిర్గతం కాని లెక్క చాలానే ఉన్నా అధికారులు ఆదిశగా విచారించడం లేదు. బాధ్యులపై చర్యలు తీసుకుని నిధులు వసూలు చేయాలని పొదపు సంఘాల మహిళలు కోరుతున్నారు.

వెంకన్న లడ్డూ కల్తీ పెద్దతప్పు: సుమన్

సుమన్‌ను ఆశీర్వదిస్తున్న ఆలయ అర్చకులు

గుంతకల్లు, న్యూస్‌టుడే : తిరుమల లడ్డూను కల్తీచేసి కొందరు తీవ్రవా దుల కన్నా పెద్దతప్పు చే శారని చలనచిత్ర నటుడు సుమన్ అన్నారు. గుంతక ల్లులో ఆయన ఓ ప్రైవేట్ కార్యక్రమానికి హాజరై విలే కరులతో మాట్లాడారు. సినిమాలో వేంకటేశ్వరస్వామి పాత్రను ధరించిన తనకు వెంకన్న అంటే విపరీతమైన భక్తి అని అన్నారు. హిందువులంతా తిరుమల లడ్డూను ఎంతో భక్తితో స్వీకరిస్తారు. అలాంటి పవిత్రమైన ప్రసాదాన్ని కొందరు కల్తీచేసి హిందువుల మనోభావాలను దెబ్బతీశారని విమర్శించారు. పాల కమడలి, అధికారులు ఏమిచేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. నెయ్యి ట్యాంకర్లతో వచ్చినపుడు దాన్ని తనిఖీచేసి తీసుకోవాల్సిన బాధ్యతను అందరూ విస్మరించారన్నారు. ఇందులో ఎవరి పాత్ర ఉన్నా ప్రభుత్వం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. తిరుమలలోనే కాకుండా ఇతర మతాల విషయంలోనూ ఇలా చేస్తే కఠినంగా శిక్షలు వేయడానికి ప్రభుత్వం పార్లమెంటులో బిల్లును తీసుకురావాలన్నారు.

గుంతకల్లు గ్రామీణం: కసాపురం శ్రీనెట్టికంటి అంజనేయస్వామిని సినీ నటుడు సుమన్ ఆదివారం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చ కులు అయనకు స్వాతగం పలికారు. ఆలయంలో ప్రదక్షిణలు అనంతరం ఆయన స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వారి పేరిట ప్రత్యేక అర్చనలు చేసి స్వామి వారి తీర్థప్రసాదాలు, చిత్రపటాన్ని అందజే శారు. ఆయన వెంట తెదేపా నాయకుడు అనిల్ కుమార్ గౌడు పాల్గొన్నారు.

చూస్తూనే ఉండండి.. కప్పేస్తూనే ఉంటుంది..

జాతీయ రహదారి అధికారుల నిర్లక్ష్యానికి నిలువెత్తు నిదర్శనమీ చిత్రం.. రోడ్డు పక్కనే కాదు.. రోడ్డుపైకి కంపచెట్లు దూసుకొస్తున్నా.. అడిగే నాథుడే లేరు. గుంతకల్లు పట్టణ సమీపం నుంచి వెళుతున్న 67వ జాతీయ రహదారిలో శ్రీలక్ష్మి కోల్డ్ స్టోరేజ్ వద్ద కంపచెట్లు పెరిగిపోవడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోల్డ్ స్టోరేజీ నుంచి గుంతకల్లు బ్రాంచి కెనాల్ వరకు జాతీయ రహదారికి ఇరువైపులా ముళ్లపొదలు పెరిగిపో యాయి. రాత్రి సమయంలో వాహనాలను ఏమాత్రం అజాగ్రత్తగా నడిపినా ప్రమాదాలు జరిగే పరిస్థితి ఉందని చోదకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎన్‌హెచ్ అధికారులు చొరవ తీసు కొని ముళ్లపొదలు తొలగించాలని ప్రజలు కోరుతున్నారు. – **న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం**

నిరుద్యోగులకు వరం.. ఉచిత శిక్షణ

◆ టెట్ అభ్యర్థులకు పాఠ్య సామగ్రి పంపిణీ ◆ ప్రభుత్వ సహకారంతో కొలువుల వైపు యువత

ప్రభుత్వం సరఫరా చేసిన పుస్తకాలతో మైనార్టీ అభ్యర్థులు, నిర్వాహకులు

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: ఐదు సంవత్సరాల తరువాత ఉపాధ్యాయ ఉద్యోగాల భర్తీని సన్నాహాలు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి చంద్రబాబు మెగా డీఎస్సీకి తొలి సంతకం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 16,347 ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేయనున్నారు. ఉపాధ్యాయ ఉద్యో గార్థుల్లో ఉత్సాహం నెలకొంది. ఉపాధ్యాయ ఉద్యోగ అర్హత కోసం టెట్, డీఎస్సీ పరీక్షలకు అభ్యర్థులు సన్నద్ధమవుతున్నాయి. ఉమ్మడి అనంత జిల్లాలో 40వేల మంది అభ్యర్థులు ఉపాధ్యాయ ఉద్యోగా లకు పోటీ పడుతున్నారు. డీఎస్సీ ఉద్యోగాలకు ఎక్కువ శాతం పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన అభ్యర్థులు సన్నద్ధమవుతు న్నారు. పేద, మధ్య తరగతి అభ్యర్థులకు ప్రభుత్వం తగిన సహ కారం అందిస్తోంది. డీఎస్సీ, టెట్ పరీక్షలకు సన్నద్ధవుతున్న మైనార్టీ అభ్యర్థులకు ప్రభుత్వం ఉచిత శిక్షణ అందిస్తోంది. అనంత నగరం లోని కుట్టి కళాశాలలో 2 నెలల పాటు ఉచిత శిక్షణ అందించారు. సెంటర్ ఫర్ ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్ ఆఫ్ మైనార్టీస్, మైనార్టీ సంక్షేమ విభాగం సహకారంతో ఉచిత శిక్షణ, మెటీరియల్ పుస్త కాలు ఉచితంగా అందజేశారు. స్థానిక శిక్షణ కేంద్రంలో మెటీరి యల్ పంపిణీ చేశారు. 31 మంది మైనార్టీ అభ్యర్థులు శిక్షణ సద్వి నియోగం చేసుకొన్నారు. నవంబరు నుంచి 100 మంది మైనార్టీ అభ్యర్థులకు డీఎస్సీ పరీక్షలకు ఉచిత శిక్షణ అందించున్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కుట్టి కళాశాల డైరెక్టర్ సత్యనారాయణ విజ్ఞప్తి చేశారు.

ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు

జరీన, అనంతపురం

2018లో కర్నూలులో డీఎస్సీ శిక్షణ తీసు కొన్నా. చాలా ఖర్చయింది. ప్రభుత్వం ఉచి తంగా అందజేసిన శిక్షణలో చాలా అంశాలు తెలుసుకున్నాను. ముఖ్యమంత్రి చంద్రబాబు ఉచితంగా శిక్షణతో పాటు, పుస్తకాలు సర ఫరా చేశారు. సీఎంకు కృతజ్ఞతలు.

శిక్షణ ఎంతో బాగుంది

షాను, అనంతపురం

ఇంట్లో ఉంటూ పరీక్షలకు సన్నద్ధమైతే పెద్ద ప్రయోజనం ఉండదు. శిక్షణ తీసుకొంటే పోటీ పరీక్షలకు రాణించవచ్చు. మైనార్టీ అభ్యర్థులకు ఉచిత శిక్షణ ఇవ్వడం అభినంద నీయం. శిక్షణ చాలా బాగుంది. ఉద్యోగం సాధిస్తాననే నమ్మకం కలిగింది.

డీఎస్సీ కోసం సాధన

తబస్సుం, రుక్సానా, అనంతపురం

ఐదేళ్లలో ఉద్యోగాలు లేవు. నూతన ప్రభుత్వం ఉద్యోగాల ప్రకటన జారీ చేస్తోంది. డీఎస్సీ కోసం ఉచిత శిక్షణ కార్యక్రమాలు వరం లాంటివి. టెట్‌లో శిక్షణ తీసుకొన్నాం, డీఎస్సీ ఉచిత శిక్షణ కూడా సద్వినియోగం చేసుకొంటాం.

అడ్డదారుల్లో ఉపాధ్యాయులు.. ఉదాసీనంగా అధికారులు

- నగరంలోని రాజేంద్రనగర పాలకోన్నత పాఠ శాలలో పనిచేస్తున్న ఓ ఉపాధ్యాయుడు చిట్టీల పేరుతో రూ.10 కోట్లకు పైగా మోసం చేశారు. బాధిత ఉపాధ్యాయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన కొంతకాలంగా అజ్ఞాతంలో ఉన్నారు. ఇటీవల ఆయన న్యాయస్థానంలో లొంగిపో వడంతో రిమాండ్‌కు పంపించారు. కేసు నమోదైన వెంటనే ఉద్యోగులను సస్పెండ్ చేయాలి. కానీ విద్యా శాఖ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని పలువురు ఉపాధ్యాయులు విమర్శిస్తున్నారు.

- రాప్తాడు, విడపనకల్ మండలాల్లోని ఇద్దరు ఉపా ధ్యాయులు కోట్లాది రూపాయలు అప్పులు చేశారు. తీసుకున్న అప్పులు వెనక్కు ఇవ్వకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ఆ ఇద్దరే కాదు, అనంత జిల్లాలో చాలా మంది ఉపాధ్యాయులు పాఠశాలలకు హాజరు కావడం లేదు. అయినా వారిపై కనీస చర్యలు విద్యాశాఖ అధి కారులు తీసుకోవడం లేదని ఆరోపణలు వస్తున్నాయి.

అనంతపురం విద్య, న్యూస్‌టుడే: అనంతపురం జిల్లాలో విద్యా శాఖ అధికారులు అక్రమా ర్కులపై ఉదాసీనంగా వ్యవహరి స్తున్నారు. పిల్లలకు విద్యాబు ద్ధులు నేర్పాల్సిన గురువులు అడ్డదారుల్లో వెళ్తున్నారు. ఆర్థిక నేరాలకు పాల్పడుతూ పవిత్ర వృత్తికి మచ్చతెస్తున్నారు. ఉపా ధ్యాయులు నెలల తరబడి పాఠ శాలలకు హాజరు కాకపోయినా కనీస చర్యలు కూడా తీసుకో వడం లేదని ఆరోపణలు వస్తు న్నాయి. విద్యాశాఖ అధికారులు పాఠశాలల్లో పర్యవేక్షించకపో వడం, నెలల తరబడి విధులకు హాజరుకాకపోయినా తగిన కార ణాలు ఆరా తీయకపోవడం దారుణం. సెలవు పెట్టకుండా నెలల తరబడి పాఠశాలకు రాని ఉపాధ్యాయులపై విద్యాశాఖ అధికారులు కనీస చర్యలు కూడా చేపట్టలేదు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం, ఆగిపో యిన నాడు-నేడు పనుల గురించి ఎవరూ పట్టించుకో వడం లేదు. పరీక్షల విభాగంలో రూ.లక్షలు అవినీతి జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. అక్రమా లపై విచారణ పేరుతో కాలా యాపన చేస్తున్నారు. ఆ విభా గంలోనే ఓ ఉపాధ్యాయుడు అనధికారికంగా విధులకు ఎక్కువ రోజులు హాజరు కాలే దని విమర్శలు కూడా ఉన్నాయి. విద్యాశాఖను అధికా రులు గాలికొదిలేశారు.

విద్యాశాఖాధికారిపై చర్యలు తీసుకోవాలి

నిరసన వ్యక్తం చేస్తున్న ఫోర్టో నాయకులు

అనంతపురం విద్య: అ క్రమాలకు పాల్పడుతున్న అనంతపురం జిల్లా విద్యా శాఖాధిపై చర్యలు తీసుకో వాలని ఫోర్టో రాష్ట్ర అధ్య క్షుడు కరణం హరికృష్ణ డిమాండ్ చేశారు. విద్యా శాఖపై పత్రికల్లో వెలువ డిన కథనాలను ఆదివారం స్థానిక ఫోర్టో కార్యాలయంలో ప్రదర్శించారు. రాజ్యాంగ నిబంధనలు, న్యాయస్థానం తీర్పులు, ప్రాథ మిక హక్కులను విద్యాశాఖాధికారి అప హాస్యం చేసే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఉపాధ్యాయ లోకాన్ని భయ భ్రాంతులకు గురిచేస్తూ ఆ ముసుగులో అక్ర మాలకు పాల్పడుతున్నారని విమర్శించారు. సాధారణ పరీక్ష మండలిలో రూ.31.80 లక్షలు పక్కదారి పట్టినా విచారణ జరిపించ కుండా నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. సమగ్రశిక్ష కార్యాలయంలో సెక్టోరియల్ అధి కారులకు పోస్టింగ్ ఇవ్వడంలో కూడా రూ. లక్షలు ముడుపులు తీసుకొని నిబంధనలకు విరుద్ధంగా పోస్టింగ్ ఇచ్చారన్నారు. ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ఇవ్వడంలో కూడా ఇష్టారాజ్యంగా వ్యవహరించి విద్యాశాఖ ప్రతి ష్ఠను దిగజార్చారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారిని సస్పెండ్ చేసి, అక్రమాలపై విచా రణ జరిపించాలన్నారు. శివానందరెడ్డి, ఆదిశే షయ్య, వేణుగోపాల్, వెంకటేష్, ఆదిమూర్తి, అల్లాబకాష్ పాల్గొన్నారు.

ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ల బదిలీ

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం ఉమ్మడి జిల్లాలోని ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖలో ఇన్‌స్పెక్టర్లకు బదిలీలు జరిగాయి. రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం రాత్రి ఉత్తర్వుల జారీ చేసింది. అనంతపురం జిల్లా లోని 10, శ్రీసత్యసాయి జిల్లాలోని 8 స్టేషన్లకు నియమించారు. అనంత పురం నగర స్టేషన్‌కు సత్యనారాయణ, బుక్కరాయసముద్రానికి నాగసునీత రాణి, గుత్తికి ఉమాదేవి, గుంతకల్లుకు శివసాగర్, తాడిపత్రికి నాయుడు, ఉర వకొండకు రవిచంద్ర , కణేకల్లుకు ఉమాబాయి, రాయదుర్గానికి గణేశ్, కళ్యా ణదుర్గానికి హసీనా భాను, కంబదూరుకి రఫీ.. శ్రీసత్యసాయి జిల్లాలో ధర్మ వరానికి చంద్రమణి, చెన్నేకొత్తపల్లికి ఫరూక్ ఆజం, పెనుకొండకు సృజన్ బాబు, పుట్టపర్తికి నాగరాజు, హిందూపురానికి లక్ష్మీదుర్గయ్య, కదిరికి వీరా రెడ్డి, తనకల్లుకు వెంకటలక్ష్మమ్మ, మడకశిరకు ప్రసాద్‌ను నియమించారు.

మార్కెట్‌కు వెళితే బురద తొక్కాల్సిందే

రాయదుర్గం పట్టణంలోని కూరగాయల మార్కెట్‌లో చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. వందలాది వినియోగదారులు బురదలో నిల్చుని కూరగాయలు కొనుగోలు చేయాల్సిన దుస్థితి నెలకొంది. పగటి పూట వర్షం వస్తే వినియోగదారులు తడవాల్సిందే. మార్కెట్‌లో వ్యాపారాలు చేసుకునేందుకు మున్సిపల్ అధికారులు కనీసం షెడ్లు కూడా ఏర్పాటు చేయకపోవడంతో వ్యాపారులు ప్లాస్టిక్ కవర్లు, ఆర్థిక స్తోమత ఉన్నవారు రేకులు వేసుకుని వ్యాపారాలు చేస్తున్నారు. సిమెంట్ షాట్ ఫాం కూడా లేకపోవటంతో నేలపైనే కూర్చొని వ్యాపా రాలు చేయాల్సి వస్తోంది. రోజూ పన్నులు వసూలు చేసే మున్సిపల్ అధికారులు కనీస సౌకర్యాలు కల్పించడం లేదని వ్యాపారులు ఆందో ళన వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో సౌకర్యాల కల్పనకు చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ వి. దివాకర్‌రెడ్డి తెలిపారు.

– **న్యూస్‌టుడే, రాయదుర్గం**

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వర పూజలు

ఆత్మకూరు మండలం పంపనూరు సుబ్ర హ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆది వారం స్వామి వారికి ప్రత్యేక పూజా కార్యక్ర మాలు ఏర్పాటు చేశారు. ఉదయం 9 గంటల నుంచి స్వామి వారికి పాలాభిషేకం, పంచామృతాభిషేకం, ఆకుపూజ కార్యక్రమా లను నిర్వహించారు. ఉదయం నుంచి స్వామి వారిని పెద్దఎత్తున భక్తులు దర్శించు కున్నారు. మధ్యాహ్నం 1 గంటకు స్వామి వారికి ప్రత్యేక హారతిని అందజేశారు. యాగమండపంలో నవగ్రహ, కుజదోష, కాల సర్పదోష హోమాలను నిర్వహించారు.

– **న్యూస్‌టుడే, ఆత్మకూరు**

ఆశలన్నీ రబీపైనే..



అనంతపురం(వ్యవసాయం), న్యూస్‌టుడే: ఖరీఫ్ సీజన్ ముగి సింది. అక్టోబరు ఒకటో తేదీ నుంచే రబీ సీజన్ ప్రారంభం కానుంది. ఖరీఫ్ ప్రారంభం నుంచే తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాధార కింద పంటలు అరకొరగా సాగయ్యాయి. మెట్ట పంటల సాధారణ సాగు 3,46,733 హెక్టార్లు కాగా 2,24,378 హెక్టార్లలో వివిధ రకాల పంటలు సాగు చేశారు. ఇంకా 1,22,355 హెక్టార్లలో విత్తనం వేయలేదు. ఇప్పటికీ చాలా మండలాల్లో వర్షాభావం వెంటాడుతుండటంతో పైరు వాడుముఖం పట్టింది. ఖరీఫ్ ఆశలు అడగంటుతున్నాయి. రబీ వచ్చేస్తోంది. అడపాదడపా అక్కడక్కడ కురుస్తున్న వర్షాలతో ఎలాంటి ప్రయోజనం లేదు. దీంతో అన్నదాతలు రబీపైనే ఆశలు పెట్టుకున్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో రబీ సీజన్‌లో ప్రధాన పంట నల్లరేగడి నేలల్లో సాగు చేస్తారు.

సాగు లక్ష్యం 1,18,477 హెక్టార్లు

అక్టోబరు ఒకటో తేదీ నుంచి రబీసీజన్ ప్రారంభ మవుతోంది. సాధారణ సాగు మొత్తం 1,18,477 హెక్టార్లలో లక్ష్యంగా పెట్టుకున్నారు. అందులో ప్రధాన పంట పప్పుశనగ 72,909 హెక్టార్లు, వేరుసె నగ 20,900, మొక్కజొన్న 7,844, జొన్న 4,735, వరి 6,928, పొద్దుతిరుగుడు 1,323, ఉలవలు 953, తెల్ల కుసుము 519, పెసర 493, మినుములు 487, కొర్ర 418, పత్తి 415 హెక్టార్లు చొప్పున సాగు ప్రణాళికను వ్యవసాయశాఖ సిద్ధం చేసింది.

80,920 మెట్రిక్ టన్నుల ఎరువులు

జిల్లాకు రబీ సీజన్‌కు మొత్తం ఎరు వులు కేటాయింపు చేశారు. అక్టోబరు నుంచి వచ్చే మార్చి నెలవారీగా ఏయే ఎరువులు కావాలో ప్రణాళిక సిద్ధం చేశారు. మొత్తం 80,920 మెట్రిక్ టన్నుల ఎరువులు కేటాయించారు. అందులో యూరియా 25,994 మెట్రిక్ టన్నులు, డీఏపీ 9,455, మ్యూరేట్ ఆఫ్ పొటాష్ 4,903, కాంప్లెక్స్ ఎరువులు 37,908, సింగల్ సూపర్ ఫాస్ఫేట్ 2,660 మెట్రిక్ టన్నుల చొప్పున ఎరువులు కేటాయించారు.

పటా పప్పుశనగ తగ్గుతూ..

రబీలో ఉమ్మడి జిల్లాలో 28 మండలాల్లో పప్పుశనగ సాగవు తోంది. అతివృష్టి, అనావృష్టితో ఏటా సాగు విస్తీర్ణం తగ్గుతూనే ఉంది. పదేళ్ల కిందట 2 లక్షల హెక్టార్లలో పంట సాగ యేది. పెట్టుబడి భారం, గిట్టుబాటు ధర లేకపోవడం, ప్రభుత్వ రాయితీలు తగ్గించడంతో సాగు తగ్గుతోంది. గత వైకాపా ప్రభుత్వం హయాంలో పప్పుశ నగ రైతులకు ఎలాంటి లబ్ధి చేకూరకపో వడంతో సాగు మరింత పడిపోయింది. 2018లో 1.40 హెక్టార్లలో పంట సాగు చేశారు. 2019లో లక్ష హెక్టార్లు సాగు చేయగా, 2020లో 87,776, 2021లో 82,642, 2022లో 73,776, 2023లో 49,401 హెక్టార్లకు పడిపోయింది.

విత్తన కేటాయింపు ఇలా..

రబీలో నల్లరేగడి నేలల్లో సాగు చేసే రైతులకు పప్పుశనగ విత్తనం రాయితీతో ప్రభుత్వం అందిస్తోంది. వర్షాభావ పరిస్థితులు కొనసాగుతున్నాయి. జిల్లాకు విత్తన కేటాయింపులు చేశారు. అయితే రాయితీ ధరలు ఇంకా నిర్ణయించలేదు. రాష్ట్రస్థాయిలో పప్పుశనగ సరఫరాకు టెండర్ల ప్రక్రియ జరుగుతోంది. జిల్లాకు 27,139 క్వింటాళ్లు కేటాయించారు. రెండ్రోజుల్లో ధరలు ఖరారయ్యే అవకాశం ఉంది.

ప్రణాళిక సిద్ధం చేశాం – ఉమామహేశ్వరమ్మ, జిల్లా వ్యవసాయాధికారిణి

నల్లరేగడి నేలల్లో పప్పుశనగ ప్రధాన పంట. పప్పుశనగ విత్తన కేటాయింపులు జరిగాయి. కానీ, విత్తన ధరలు ఖరారు కావాల్సి ఉంది. రబీకి ఆరునెలలపాటు ఎరువులు అవసరం నికి అనుగుణంగా నెలవారీగా కేటా యింపుల ప్రకారం సిద్ధంగా ఉంచు తున్నాం. అక్కడక్కడ వానలు కురు స్తున్నాయి. వర్షం వస్తే అక్టోబరు నెలంతా పంటలు సాగు చేసుకోవచ్చు.

వైకుంఠ సమారాధన
మంచికి మారుపేరుగా నిలిచి మమతానురాగాలను పంచి, అహర్నిశలు కుటుంబ ఉన్నతికై శ్రమించి మా అందరి హృదయాలలో చెరగని ముద్రవేసి, దైవసన్నిధికి చేరిన మీ పవిత్ర ఆత్మకు శాంతి కలగాలని భగవంతున్ని ప్రార్థిస్తూ... శోకతప్త హృదయాలతో...
భార్య: తమ్మినేని సునీత (లక్ష్మిదేవి)
కుమారు - అల్లుడు
గన్నేపుష్పలత - గన్నే శ్రీహరి
మనుమళ్లు: జి.ప్రణములు, జి.వెార్ల
మీలియు తమ్మినేని, గన్నేవారి కుటుంబ సీభ్యులు
కీ॥శే॥ తమ్మినేని గోపాలనాయుడు గారు
రిటైర్డ్ మూవలింటెండెంట్, పంచాయతీరాజ్ డిపార్ట్‌మెంట్
జననం: 01-07-1967 మరణం: 20-9-2024
వైకుంఠ సమారాధన: 30-09-2024 సోమవారం మా స్వగృహము దోర్.నెం: 6-5-189, రాంనగర్, 7th క్రాస్, ATP నందు జరుగును.

(c) eenadu

సేవా పన్ను వసూలైతే.. ప్రగతికి బాటలు

✦ పురపాలికలకు రూ.13 కోట్ల బకాయిలు

✦ పట్టించుకోని రైల్వే శాఖ

గుంతకల్లు, న్యూస్‌టుడే : గుంతకల్లు రైల్వే అధికారులు పురపాలకానికి కొన్నేళ్లుగా సేవా పన్ను బకాయిలు చెల్లించడం లేదు. అధికారులు కాళ్లరిగేలా తిరుగుతున్నారు. ఇప్పుడు.. అప్పుడు అంటూ కాలం గడుపుతున్నారు. గుంతకల్లు రైల్వే అధికారులు పురపాలకానికి రూ.7 కోట్ల వరకు బకాయిలను చెల్లించాల్సి ఉంది. ప్రధానంగా రైల్వేస్టేషన్లు ఉన్న అనంతపురం, గుత్తి, తాడిపత్రి, ధర్మవరం, కదిరి తదితర పురపాలకాలకూ రూ.5 కోట్లకు పైన సేవా పన్ను రైల్వే నుంచి అందాల్సి ఉంది.

ఎందుకు చెల్లించాలంటే..?

రైల్వేలో పని చేస్తున్న అధికారులు, ఉద్యోగులు, రైళ్లలో ప్రయాణించే ప్రయాణికులు పురపాలకానికి చెందిన రోడ్లు, మార్కెట్లు, దుకాణాలు, పెట్రోలు బంకులు, రెవెన్యూ, పురపాలక కార్యాలయాల సేవలను వినియోగించుకుంటుంటారు. ఈక్రమంలో పురపాలకానికి పన్నును చెల్లించాలని ఉన్నత న్యాయస్థానాలు

పన్ను బకాయిపడిన డీఆర్‌ఎం కార్యాలయం

2009 సంవత్సరంలో తీర్పు ఇచ్చాయి. రైల్వే భవనాలు, స్థలాలను బాడుగలకు ఇస్తే ఎంత మొత్తం చెల్లించాల్సి వస్తుందో అంత మొత్తంలో 33 శాతం వరకు పన్ను కింద చెల్లించాలని న్యాయస్థానాలు తీర్పు ఇచ్చాయి. దీనికి గాను రాష్ట్ర పురపాలక ఉన్నతాధికారులు ఉత్తర్వు సంఖ్య: 170-టి.సి1-2010-1ను జారీ చేశాయి. దీన్ని అమలు చేయడానికి పురపాలక అధికారులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించడం లేదు.

ఒత్తిడి తెస్తున్నాం: - వాసిర్, పురపాలక రెవెన్యూ అధికారి, గుంతకల్లు

సేవా పన్ను కింద రైల్వే నుంచి రూ.7 కోట్లు రావాలి. 14 ఏళ్లుగా చెల్లించడం లేదు. దీనిగురించి ప్రతి డీఆర్‌ఎం వద్ద చర్చకు తీసుకొస్తున్నాం. డిమాండ్ నోటీసులు ఇస్తుంటే వారు చూస్తాం, ఇస్తాం అంటూ కాలం గడుపుతున్నారు. పన్ను వసూలు అయితే ప్రగతి పనులకు ఆస్కారం ఉంటుంది. దీనిపై మరింత ఒత్తిడి తీసుకొస్తాం.

అభివృద్ధికి వెనులు బాటు

సేవా పన్ను బకాయిలు వసూలైతే పట్టణాల్లో ప్రజలకే కాకుండా రైల్వే వినియోగదారులకూ మంచి సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయి. ప్రస్తుతం పురపాలికలు నిధులు లేకపోవడంతో అభివృద్ధి పనులు అధికారులు అనుకున్న మేరకు చేయలేక పోతున్నారు. సరైన రోడ్లు, మురుగు కాలువలు, మార్కెట్ సౌకర్యాలు లేక ఇబ్బంది పడుతున్నారు. కొత్తగా వచ్చిన తెదేపా ప్రభుత్వం పన్నుల వసూలుపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

పాలకుల్లో మార్పు వస్తేనే సమ సమాజం

ఆజాద్‌నగర్ (అనంతపురం), న్యూస్‌టుడే: అధికార మార్పిడి జరిగినంత మాత్రాన సమ సమాజం స్థాపన సాధ్యం కాదని, పాలక వర్గం ఆలోచనా స్వరూపంలోనే మార్పు రావాల్సి ఉందని కేరళ ప్రభుత్వ ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు, ప్రొఫెసర్ వీకే. రామచంద్రన్ పేర్కొన్నారు. లెనిన్ వర్ధంతి సందర్భంగా అనంతపురం నగరంలో సీపీఎం అనంతపురం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో 'రాజ్యం, విప్లవం' అనే అంశంపై సదస్సు జరిగింది. లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. రామచంద్రన్ మాట్లాడుతూ.. నేటి పెట్టుబడిదారీ వ్యవస్థలో పేద, ధనికుల మధ్య

ప్రసంగిస్తున్న ప్రొఫెసర్ వీకే రామచంద్రన్

అంతరాలు అనివార్యమని మార్క్సు, లెనిన్‌లు ఇద్దరూ ఆనాడే తమ రచనల ద్వారా తెలియజేసారని గుర్తుచేశారు. సమాజంలో పాలకవర్గాలన్నీ కూడా పెట్టుబడిదారుల ప్రయోజనాలను కాపాడేందుకే పనిచేస్తాయని చెప్పారు. ప్రతి నలుగురు చిన్నారుల్లో ముగ్గురికి సరైన పౌష్టికాహారం లభించడం లేదన్నారు. కార్మికులు కనీస వేతనాలకు నోచుకోవడం లేదని పేర్కొన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు రాంభూపాల్, రాష్ట్ర నాయకులు ఓబులు, నాయకులు భానుకిరణ్, బాషా, గోవిందరాజులు, సత్యబోస్, రాజ్‌మోహన్, రమణయ్య, సతీష్, రంగనాయకులు, సత్యనారాయణరెడ్డి, సావిత్రి పాల్గొన్నారు.

టమాటా ధర పెరుగుదల

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: అనంతపురం గ్రామీణం కక్కలపల్లి మార్కెట్‌లో పది రోజులుగా టమాటా ధరలు నిలకడగా ఉన్నాయి. ధరలు బాగుండడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మార్కెట్‌లో ఐదు రోజులుగా విక్రయాలు బాగా తగ్గాయి. విక్రయాలు తగ్గడంతోనే ధరలు తగ్గకుండా ఉన్నాయని వ్యాపారవర్గాలు తెలిపాయి. ఆదివారం మార్కెట్‌కు 2 వేల నుంచి 3 వేలు పైచిలుక టన్నులు మార్కెట్‌కు వచ్చేవి. ఐదు రోజులుగా 1600-1,300 టన్నులు వచ్చాయి. ఆదివారం 1,350 టన్నులు వచ్చాయి. కిలో టమాటా గరిష్ఠ ధర రూ.47 ఉండగా మధ్యస్థ ధర రూ.38, కనిష్ఠ ధర రూ.30 వరకు ధరలు పలికాయి. మార్కెట్‌కు 15 కిలోల బుట్టెలు వస్తున్నాయి. ఒక్కో బుట్టె ధర గరిష్ఠంగా రూ.705, మధ్యస్థం రూ.570, కనిష్ఠం రూ.450 చొప్పున ధర చొప్పున పలికాయని మార్కెట్ ఇన్‌ఛార్జి రాంప్రసాద్‌రావు తెలిపారు.

అండర్-19 చెస్ పోటీలకు క్రీడాకారుల ఎంపిక

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: కర్నూలు జిల్లాలో జరగనున్న రాష్ట్ర స్థాయి పాఠశాల క్రీడల అండర్-19 చెస్ పోటీలకు జిల్లా క్రీడాకారులను ఎంపిక చేశారు. కొత్తపూరు జూనియర్ కళాశాల మైదానంలో ఎంపిక పోటీలకు నిర్వహించి అందులో ప్రతిభ చూపిన క్రీడాకారులను రాష్ట్ర పోటీలకు ఎంపిక చేశారు. రాష్ట్రస్థాయి పోటీలు వచ్చే నెల మూడో వారంలో నిర్వహించనున్నారు. జిల్లా పాఠశాల క్రీడల సమాఖ్య జిల్లా కార్యదర్శి జి. లక్ష్మీనారాయణ, చెస్ శిక్షకుడు హుస్సేన్‌ల పర్యవేక్షణలో క్రీడాకారులను ఎంపిక చేశారు.

ఎంపికైన క్రీడాకారులతో శిక్షకులు

ఎంపికైన క్రీడాకారుల వివరాలు..

బాలురు: అదిత్యారెడ్డి, హన్ని స్వీపెన్, విశ్వనాథ్, మిస్ఫా, తరుణ్ **బాలికలు:** అనన్య, భువనకృతి, క్లారా, అభిజ్ఞ, సాహామారీన్

శ్రీరామరెడ్డి కార్మికుల మెరుపు సమ్మె

రాయదుర్గం, న్యూస్‌టుడే: డిమాండ్లు తీర్చాలని కోరుతూ రాయదుర్గం నియోజకవర్గంలోని శ్రీరామరెడ్డి కార్మికులు ఆదివారం ఉదయం 11 గంటలకు విద్యుత్తు మోటార్లు నిలిపివేసి మెరుపు సమ్మెలోకి వెళ్లారు. దీంతో నియోజకవర్గంలోని వందకుపైగా గ్రామాలకు తాగునీటి సరఫరా ఆగిపోయింది. నియోజకవర్గంలోని ఆయా గ్రామాలకు చెందిన లైన్‌మెన్‌లు, ఆపరేటర్లు, ఫిట్టర్లు, వాచ్‌మెన్‌లు మొత్తం 58 మంది మెరుపు సమ్మె చేశారు. శ్రీరామరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సంఘం జిల్లా సెక్రటరీ రాము, మండలాధ్యక్షులు అశోక్, సంజీవప్పల ఆధ్వర్యంలో ఈ సమ్మె జరిగింది. నియోజకవర్గంలోని ఆలూరు, టి.వీరాపురం, రాయదుర్గం పట్టణంలోని విద్యుత్తు మోటార్లను బంద్ చేసి కార్మికులు సమ్మెలో పాల్గొన్నారు. గతంలో తాము సమ్మె చేసినప్పుడు ఈనెల 23వ తేదీలోగా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన కలెక్టర్ 29వ తేదీ దాటినా పట్టించుకోకపోవటంతో మెరుపు సమ్మె చేస్తున్నట్లు తెలిపారు. కార్మికులకు ఎనిమిది నెలల జీతాలు, ఏళ్ళ తరబడి అందాల్సిన పీఎఫ్ బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు.

ఆలూరు నీటి పథకం వద్ద ఆందోళన చేస్తున్న శ్రీరామరెడ్డి కార్మికులు

సంతల జోరు.. ఆదాయం బాగు

అనంత మార్కెట్‌యార్డు, న్యూస్‌టుడే: అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని వారం సంతలు జోరుగా కొనసాగుతున్నాయి. వారం వారం ఆదాయం పెరుగుతోంది. గత నెలలో వారం సంతలో రూ.4 లక్షలు దాటలేదు. ఈ నెలలో రూ.5 లక్షల ఆదాయం దాటింది. సంతలే యార్డుకు ఆదాయ వనరుగా మారాయి. ఈ నెలలో పశువులు, గొర్రెలు, వ్యాపారులు, రైతులు, కాపర్లతో సంతల్లో కిక్కిరిసింది. మూడు వారాలు సంతలు పరిశీలిస్తే.. ఈ నెల 16న రూ.4,30,075, ఈనెల 23న రూ.4,49,300 పెరుగుతూ వచ్చింది. ఈ వారం ఏకంగా రూ.6 లక్షలకు చేరువైంది. ఈ వారం సంతల్లో రూ.5,91,480 ఆదాయం వచ్చింది. అందులో శనివారం గొర్రెలు, మేకలు సంతలో రూ.3,42,370 ఆదాయం రాగా, పశువుల సంతలో రూ.2,49,110 ఆదాయం వచ్చిందని యార్డు ఎంపికశ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. గతంలోని సంతల్లో ఇంత భారీగా ఆదాయం ఎప్పుడూ రాలేదని యార్డు అధికార వర్గాలు పేర్కొనడం గమనార్హం.

3 నుంచి కొడిమిలో ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరం

అనంతపురం క్రీడలు, న్యూస్‌టుడే: రాష్ట్ర క్రీడల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో వచ్చే నెల 3 నుంచి బాలబాలికలకు ఉచిత క్రికెట్ శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి తెలిపారు. కొడిమి జర్నలిస్టుల కాలనీలో ఏర్పాటు చేసిన నెట్స్‌లో ఈ శిబిరం నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల పిల్లలకు శిక్షణ ఇస్తామన్నారు. పదేళ్ల నుంచి 25 ఏళ్లలోపు వారు ఈ శిబిరంలో పాల్గొనవచ్చన్నారు. క్రికెట్ సామగ్రి ఉచితంగా పిల్లలకు అందజేస్తామన్నారు. సీనియర్ క్రికెటర్లు ఈ శిబిరంలో శిక్షణ ఇస్తారని వివరించారు. ఆసక్తిగల వారు 94900-62555 చరవాణి నంబరును సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

గన్‌మెన్లను వెనక్కి పంపిన అనంత ఎమ్మెల్యే

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: రాప్తాడు నియోజవర్గానికి చెందిన వైకాపా నాయకుడు మహానందరెడ్డికి ప్రభుత్వం గన్‌మెన్లను ఇవ్వడంతో, అందుకు నిరసనగా అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తనకు కేటాయించిన గన్‌మెన్లను వెనక్కి పంపినట్లు తెలిసింది. హైదరాబాద్‌లో ఉన్న ఎమ్మెల్యే అక్కడి నుంచే గన్‌మెన్లను తిప్పి పంపినట్లు సమాచారం. మహానందరెడ్డి రాప్తాడు నియోజకవర్గంలో గతంలో ముగ్గురి హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు. ఎన్నికలకు ముందు దగ్గుపాటిని ఎమ్మెల్యేగా ప్రకటించే క్రమంలో మహానందరెడ్డి ప్రెస్‌మీట్ నిర్వహించి, దగ్గుపాటికి వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేశారు. ఇదే క్రమంలో సొంత పార్టీ నాయకులతో సైతం విభేదాలు ఉన్నాయి. రాప్తాడులో ప్రధాన నాయకుడిగా చలామణి అవుతున్న తనపై తెదేపా నుంచి తనకు ప్రాణహాని ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేసుకున్నాడు. ప్రభుత్వం అతడికి వన్ ప్లస్ వన్ గన్‌మెన్లను కేటాయించింది. దీన్ని తీవ్రంగా పరిగణించిన ఎమ్మెల్యే ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడైంది.

EENADU Classifieds

BUSINESS SERVICES

BUSINESS OFFER

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్/ఫైనాన్స్‌లో తాకట్టు ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొంటాము. స్పాట్ క్యాష్/షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్టమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కం Call: 7382114647.

EDUCATION

DMLT 2 సం॥ కోర్సునకు అడ్మిషన్లు జరుగుచున్నవి. కొన్ని సీట్లు మాత్రమే కలవు. Cl: ఇంటర్ పాస్ (ఏ గ్రూప్ అయిన) # SEEDS కాలేజ్, ATP. 9440255034.

REAL ESTATE

PLOT FOR SALE

ఆలమూరు రోడ్డు నుండి 3వ బిట్టు, 1.1/2 ఎకరాలలో, 3 మరియు 4 సెంట్లు ప్లాట్లు అమ్మకం. (1,90,000 నుండి 2,90,000 రూపాయలు ఒక సెంటుకు) ఫోన్: 78932 93954, 95502 21809

అనంతపురం NH హైవే దగ్గర, రుద్రంపేట మెయిన్ రోడ్డుకు 30x59 కొలతలు గల వాణిజ్య సముదాయానకు అనువైన రెండు ప్లాట్లు (8 సెంట్లు) అమ్మబడును, No బ్రోకర్స్, Direct Cont No: 8919733343.

JOBS

ప్రముఖ కంపెని యందు మార్కెటింగ్ పనిచేయడానికి Freshers మరియు అనుభవము కలిగిన Sales Person's కావలెను. ATP. PH: 8300925259, 9642831744

ఒమేగా హోంకేర్ నందు వృద్ధులను / పెషంట్స్ / పిల్లలను చూసుకొనుటకు ఇంటిపని వంటపని చేయుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 20K. Cell: 89776 39662, 89776 39663.

Inter CBSE +1 Maths, Phygics, Chemistry Home Tutor కావలెను. లక్ష్మీనగర్, ATP. Cell: 9550579985

ATPలో ప్రముఖ కంపెనీ నందు పనిచేయుటకు 1 Year అనుభవం గల Tally వచ్చిన Senior Accountent కావలెను. సెల్: 9032543196.

ATPలో ప్రముఖ కంపెనీ నందు అనుభవం కలిగిన కన్నడ, హిందీ & ఇంగ్లీష్ వచ్చిన Tele Callers కావలెను, మంచి జీతం: 8125169846.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తాపత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు నరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్- లిస్టులో ఉంచే మరియు/ లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

అమరావతి, పోలవరమే కాదు సీమకూ నిధులివ్వండి

ప్రొద్దుటూరు పట్టణం, న్యూస్‌టుడే: అమరావతి, పోలవరం అభివృద్ధి మాత్రమే కాకుండా రాయలసీమ అభివృద్ధికి కేంద్రంతో నిధులు సాధించాలని సీఎం చంద్రబాబునాయుడును రాయలసీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం రాయలసీమ విద్యావంతుల వేదిక నాల్గో రాష్ట్ర మహాసభలు వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు పురపాలక అనిబిసెంట్ ఉన్నత పాఠశాల ఆవరణంలోని మహిళా స్వశక్తి భవనంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 44 శాతం భూములకు నీటి ప్రాజెక్టులు ఉంటే రాయలసీమలో కేవలం తొమ్మిది శాతం భూములకు మాత్రమే కట్టారన్నారు. సీమ అభివృద్ధికి రాజకీయాలను పక్కన పెట్టి ఇక్కడి ఎమ్మెల్యేలు, ఎంపీలు సీమ ఉద్యమాన్ని బలపరచాలని పిలుపునిచ్చారు. విభజన హామీలు అమలు తీరుపై డాక్టర్ అప్పిరెడ్డి హరినాథ్ రెడ్డి మాట్లాడుతూ కేంద్రం చట్టబద్ధంగా చేసిన విభజన చట్టంలో సీమకు రావాల్సిన ప్రత్యేక ప్యాకేజీ సెయిల్ ఆధ్వర్యంలోని ఉక్కు ఫ్యాక్టరీపై మాట్లాడకుండా సీమ పాలకవర్గాలు వారి ప్రయోజనాల కోసం ప్రత్యేక హోదా ఉద్యమం తెరమీదకి తెచ్చి ప్రజలకు తీరని అన్యాయం చేశారన్నారు. సభలో వేదిక అనంతపురం కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, విరసం నాయకులు పాణి, వరలక్ష్మి, పద్మ, లక్ష్మీదేవి, రమణ, శ్రీనివాసులు రెడ్డి, హరిత పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో మాట్లాడుతున్న సీమ సాగునీటి సాధన సమితి అధ్యక్షుడు బొజ్జా దశరథరామిరెడ్డి

కామాంధుడికి దేహశుద్ధి

కొత్తచెరువు, న్యూస్‌టుడే: కొత్తచెరువు మండలం పోతులకుంట గ్రామంలో ఓ మహిళపై అత్యాచార యత్నానికి పాల్పడిన రామచంద్రారెడ్డి అనే వ్యక్తికి స్థానికులు దేహశుద్ధి చేశారు. గ్రామస్థుల వివరాల మేరకు. . ఆదివారం ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న మహిళపై అతడు అఘాయిత్యానికి పాల్పడ్డాడు. ఆమె కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు, స్థానికులు అప్రమత్తమై రామచంద్రారెడ్డిని పట్టుకొని స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేశారు. అతడిపై గతంలో కూడా అనేక ఆరోపణలు ఉన్నట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని విచారించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

బీటీపీకి కృష్ణా జలాలు తెచ్చి మాట నిలబెట్టుకోవాలి

గుమ్మఘట్ట, న్యూస్‌టుడే: భైరవానితిప్ప ప్రాజెక్టుకు కృష్ణాజలాలు తెస్తామని చెప్పిన కూటమి నాయకులు వెంటనే కార్యాచరణ ప్రారంభించి మాట నిలబెట్టుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ డిమాండు చేశారు. ఆదివారం ఆయన సీపీఐ రైతు సంఘం బృందంతో కలసి బీటీ ప్రాజెక్టును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014లో తెదేపా అధికారంలోకి వచ్చిన తర్వాత బీటీపీకి రూ.900 కోట్లకు పైగా నిధులతో కాలువలు తవ్వి, చెరువులకు నీరు అందించే పథకానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. కానీ, ప్రభుత్వం మారడంతో 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి రూ150 కోట్లతోనే బీటీ ప్రాజెక్టుకు కృష్ణా జలాలు తెస్తామని ఉత్త మాటలు చెప్పారన్నారు. ప్రాజెక్టుకు కృష్ణాజలాలు తెచ్చే విషయంలో కూటమి ప్రభుత్వం దూకుడు పెంచాలన్నారు. కార్యక్రమంలో రాయదుర్గం తాలూకా సీపీఐ ప్రధాన కార్యదర్శి నాగార్జున, ఏఐవైఎఫ్ అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి సంతోష్‌కుమార్, రాయదుర్గం ఏపీ రైతు సంఘం తాలూకా అధ్యక్ష కార్యదర్శులు నరసింహులు, తిప్పేస్వామి, మండల కార్యదర్శి దుర్గన్న, వాసికేరి రామాంజి, మల్లప్ప, ఎర్రిస్వామి తదితరులు పాల్గొన్నారు.

బీటీ ప్రాజెక్టును సందర్శిస్తున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ తదితరులు

ఉరేసుకుని వివాహిత బలవన్మరణం

అనంత నేరవార్తలు : అనంతపురం నగరంలో ఆదివారం సాయంత్రం ఓ వివాహిత ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. కుందుర్పి మండలం బెస్తరపల్లికి చెందిన లోకేశ్, కర్ణాటక రాష్ట్రం పావగడ తాలూకా బూదబెట్ట గ్రామానికి చెందిన అఖిల (25)ను ఇచ్చి వివాహం జరిపించారు. ప్రస్తుతం వారు నగరంలోని ఆరో రోడ్డులో నివశిస్తున్నారు. అఖిల స్థానికంగా ఓ ప్రైవేటు ఆసుపత్రిలో నర్సుగా పనిచేస్తోంది. కొంతకాలంగా అక్రమ సంబంధం పెట్టుకున్నావంటూ భర్త మానసికంగా, శారీరకంగా హింసించేవాడు. మూడు రోజుల క్రితం కూడా ఆమెపై భర్త దాడి చేశాడు. కుమార్తెను తీసుకుని ఆజాద్‌నగర్‌లోని తల్లి వద్దకు వెళ్లింది. ఆదివారం లోకేశ్ అత్త ఇంటి వద్దకు వెళ్లి భార్యతో గొడవపడ్డాడు. అవమానంగా భావించిన అఖిల ఇంట్లో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. గమనించిన తల్లి గంగమ్మ స్థానికుల సాయంతో కుమార్తెను ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు నాలుగో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

త్రుటిలో తప్పిన భారీ ప్రమాదం

గార్లదిన్నె, న్యూస్‌టుడే : గార్లదిన్నె మండలంలోని తలగాసిపల్లి సమీపంలో శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రాణాపాయం నుంచి 30 మంది కూలీలు బయటపడ్డారు. కూలీలతో వెళ్తున్న వాహనాన్ని డ్రైవరు నరేష్ చాకచక్యంగా నడిపి పెద్ద ప్రమాదం నుంచి తప్పించారు. తెలంగాణ రాష్ట్రం కోత్తకోట మండలం పాపంపల్లి గ్రామానికి చెందిన దాదాపు 30 మంది వలస కూలీలు జీవనోపాధి కోసం బెంగళూరుకు వెళ్లారు. అక్కడ పనులు ముగిశాక స్వగ్రామాలకు ఐచర్ వాహనంలో బయలుదేరారు. గార్లదిన్నె సమీపంలోని తలగాసిపల్లి వద్దకు రాగానే ఏపీఎం ట్రావెల్స్‌కు చెందిన బస్సు బెంగళూరు నుంచి హైదరాబాదుకు వెళ్తూ రహదారిపై ఉన్న వేగనిరోధకాలను గమనించకుండా డ్రైవర్ బస్సును వేగంగా నడిపాడు. ఈఘటనతో ముందు వెళ్తున్న ఐచర్ వాహనాన్ని ఢీకొనింది. అందులో ప్రయాణిస్తున్న కూలీలు గౌతమ్‌కుమార్, జ్యోతి, లక్ష్మి, శివమ్మ, అంజనేయులు, రాములు, మునెమ్మ, జయమ్మ,

సురక్షితంగా బయటపడిన కూలీలు

అనూష, సత్యమ్మ, వీరితోపాటు బస్సు క్లీనర్ ఉమందా గాయపడ్డారు. వీరిని చికిత్స కోసం 108 వాహనంలో అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం వారు వారి స్వగ్రామాలకు వెళ్లినట్లు ఎస్సై గౌస్‌బాషా తెలిపారు. క్షతగాత్రుల్లో బస్సు క్లీనర్ ఉమందా వలస కూలీలు గౌతమ్‌కుమార్, జ్యోతి తీవ్రంగా గాయపడ్డారు. జరిగిన ఘటనపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదుతో బస్సు డ్రైవరుపై కేసు నమోదు చేశారు.

కట్టుకున్న వాడే కాలయముడయ్యాడు

✦ భార్య గొంతుకోసి పరారైన భర్త

గుమ్మఘట్ట, న్యూస్‌టుడే: మూడుముళ్ల బంధంతో జీవితాంతం తోడుగా ఉండాల్సిన భర్తే కసాయి వాడుగా మారి భార్య గొంతుకోసి అతికిరాతకంగా చంపిన ఘటన మండలంలోని కలుగోడు గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. పోలీసులు, బాధిత కుటుంబసభ్యులు తెలిపిన వివరాల మేరకు.. కలుగోడుకు చెందిన జ్యోతి(26)కి కొత్తపల్లి గ్రామానికి చెందిన వన్నూరుస్వామితో 8 ఏళ్ల కిందట వివాహమైంది. వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడున్నారు. రెండు నెలల కిందట భార్యాభర్తలిద్దరి మధ్య మనస్పర్థలు చోటు చేసుకోవడంతో జ్యోతి పుట్టింటికి వచ్చింది. కొన్ని రోజులుగా భర్త ఇంటికి రావాలని పలుమార్లు పిలచాడు. ఎన్ని సార్లు చెప్పినా మాట వినట్లేదంటూ ఆమెను చంపేయాలని నిర్ణయించుకున్నాడు. ఆదివారం రాత్రి అత్తారింటికి వెళ్లి కుటుంబసభ్యులతో కలసి భోజనం చేసి భార్యతో చనువుగా ఉన్నట్టు నటించాడు. అర్ధరాత్రి నిద్రపోతున్న భార్య నోటిలో గుడ్డలు కుక్కి కొత్తితో గొంతుకోసి పరారయ్యాడు. ఇంటి బయట పడుకున్న అత్తామామలు వర్షం పడటంతో ఇంట్లోకి వచ్చారు. రక్తపు మడుగులో ఉన్న కూతురును చూసి గట్టిగా కేకలు వేశారు. విషయాన్ని గుమ్మఘట్ట పోలీసులకు తెలియజేయగా ఎస్‌ఐ ఈశ్వరయ్య సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఆలానాపాలనా చూడాల్సిన తల్లి అనంతలోకాలకు వెళ్లగా.. తండ్రి జైలుపాలవడంతో చిన్నారులు అనాథలయ్యారు. కుమార్తె మృతి చెందటంతో తల్లిదండ్రులు బోరున విలపించారు.



జ్యోతి

పిడుగుపడి దంపతుల దుర్మరణం

✦ కుమారుడికి తీవ్ర గాయాలు

✦ రెండు పాడి ఆవులు మృతి

గోరంట్ల, న్యూస్‌టుడే: పాడి ఆవులను పోషించుకుని జీవించే ఆ కుటుంబంపై పిడుగుపడింది. రోజు మాదిరిగానే తెల్లవారుజామున పాలు పిండేందుకు వెళ్లిన దసరా నాయక్ (51), దేవీబాయి (46) దంపతులు పిడుగుపాటుకు గురై మృతిచెందారు. ఈ సంఘటన మండలంలోని దిగువగంగంపల్లి తండాలో ఆదివారం చోటు చేసుకుంది. మృతులకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుమార్తెను అదే గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహం చేశారు. కుమారుడు, కోడలుతో కలిసి వ్యవసాయం, పాడి ఆవులను పోషించుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఈక్రమంలో వారి పొలంలో మొక్కజొన్న సాగు చేశారు. అడవి పందుల బెడద ఎక్కువగా ఉండడంతో శనివారం రాత్రి భార్యభర్తలు కాపాలా వెళ్లి అక్కడే పడుకున్నారు. రోజులాగానే ఆదివారం ఆవులకు పాలు పిండాలని తెల్లవారుజామున 5 గంటలకే బయలుదేరి పశువులషెడ్డు వద్దకు చేరుకున్నారు. తల్లిదండ్రులు రావడం ఆలస్యమవుతుందని కుమారుడు జగదీశ్ నాయక్ పాలు పిండేందుకు షెడ్డు వద్దకు వచ్చాడు. అంతలోనే వర్షం ప్రారంభమై పిడుగుపాటుకు గురయ్యారు. ఈ ఘటనలో రూ.1.50లక్షలు విలువ చేసే రెండు పాడిఆవులతో పాటు దంపతులు అక్కడికక్కడే మృత్యువాత పడ్డారు. కుమారుడు తీవ్రంగా గాయపడడంతో అనంతపురం తీసుకెళ్లారు. ఈ ఘటనతో తండాతో పాటు సమీప గ్రామాల్లో విషాద ఛాయలు అలుముకున్నాయి.

మృతిచెందిన పాడి ఆవులు



దేవీబాయి



దసరా నాయక్

మృతుల కుటుంబాన్ని ఆదుకుంటాం : కలెక్టర్ చేతన్

పుట్టపర్తి : పిడుగుపాటుతో మృతి చెందిన దసరానాయక్, దేవీబాయి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆర్డీఓ భాగ్యరేఖ, తహసీల్దార్ మారుతి, సీఐ శేఖర్, పశుసంవర్ధశాఖ అధికారులు ఘటనా స్థలికి వెళ్లి పరిశీలించారు. మృతులకు ఒక్కొక్కరికి రూ.4 లక్షలు చొప్పున పరిహారం ఇవ్వడానికి ప్రభుత్వానికి నివేదిక పంపాం. గాయపడిన వ్యక్తికి చికిత్స నిమిత్తం రూ.50 వేలు అందిస్తాం. మృతి చెందిన ఒక్కో ఆవుకు రూ.37,500 చొప్పున అందజేస్తామని కలెక్టర్ తెలిపారు.

మృతుడి ఒంటిపై గాయాలు

✦ అనుమానాస్పద మృతిగా బంధువుల ఫిర్యాదు

గార్లదిన్నె, న్యూస్‌టుడే : లోలూరుకు చెందిన ఖాసీం(49) మృతి పలు అనుమానాలకు దారి తీసింది. ఆదివారం గార్లదిన్నె పోలీసుస్టేషన్‌లో మృతుడి భార్య బంధువులు తెలిపిన వివరాల మేరకు.. ఖాసీం రోజు కూలీ పనులకు వెళ్లేవాడు. శనివారం

రాయదుర్గం

• రాయదుర్గం • కళ్యాణదుర్గం • ఉరవకొండ

మహిళను కాపాడిన పోలీసులు

రాయదుర్గం, న్యూస్‌టుడే: పట్టణంలోని అనంతపురం రోడ్డు రైల్వేగేటు సమీపంలో రైలు కింద పడేందుకు యత్నించిన ఒక మహిళను రాయదుర్గం పోలీసులు కాపాడి ఆమె కుమారుడికి అప్పగించిన సంఘటన ఆదివారం సాయంత్రం జరిగింది. డి.హిరేహాళ్ మండలం కూడ్లూరు పంచాయతి పరిదిలోని నాగలాపురం గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని ఎన్.శివలింగమ్మ రైలు కింద పడేందుకు యత్నించగా రైల్వే గేట్‌మెన్ గుర్తించి రాయదుర్గం పోలీసులకు సమాచారమందించారు. వెంటనే అప్రమత్తమైన పోలీసులు శివలింగమ్మను కాపాడి రాయదుర్గం రైల్వే స్టేషన్‌కు తీసుకువచ్చారు. ప్రసారమాధ్యమాల్లో ఈ విషయం ప్రసారం కాగా ఆమె కుమారుడు ఎన్.వన్నూరుస్వామి హుటాహుటిన రాయదుర్గం పోలీసుస్టేషన్‌కు చేరాడు. పోలీసులు విచారించి శివలింగమ్మను ఆమె కుమారుడు వన్నూరుస్వామికి ఆదివారం సాయంత్రం అప్పగించినట్లుగా అర్బన్ సీఐ జయనాయక్ తెలిపారు.

ఉరవకొండలో మోస్తరు వర్షం

ఉరవకొండ పట్టణంలో ఆదివారం ఉదయం ఓ మోస్తరు వర్షం కురిసింది. పట్టణంలో వీధులు జలమయం అయ్యాయి. నాలుగైదు రోజులుగా వాతావరణం వేడిగా ఉండగా, తాజాగా కురిసిన వర్షంతో కాస్త చల్లబడింది. మోస్తరు వర్షానికి పలు చోట్ల మురుగు కాలువలు నిండి, మురుగు నీరు బయటికి వచ్చాయి. దుర్వాసనతో స్థానికులు ఇబ్బంది పడ్డారు. **- న్యూస్‌టుడే, ఉరవకొండ**

అనాథ చిన్నారులకు అన్నదానం

ఉరవకొండ : పట్టణంలోని బేతేలు ప్రార్థనా మందిరంలో ఆశ్రయం పొందుతున్న అనాథ చిన్నారులకు తెదేపా మండల కన్వీనరు విజయభాస్కర్ అన్నదానం చేయించారు. తన మనవరాలు జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన వారికి తోడ్పాటును అందించారు. వారిలో ఆనందాన్ని నింపాలన్న ప్రయత్నంతో అన్నదానం చేసినట్లు తెలిపారు.

ఉరవకొండలో నాకాబందీ

ఉరవకొండ, న్యూస్‌టుడే: పట్టణంలోని కొండ కింద ఉన్న కాలనీలో పోలీసులు సీఐ సురేశ్‌బాబు ఆధ్వర్యంలో ఆదివారం వేకువ జామున నాకాబందీ నిర్వహించారు. అక్కడ సంచార జీవనం చేస్తున్న వారి ఇళ్లను సునిశితంగా శోధించారు. అనుమానితులను ప్రశ్నిస్తూ, వారికి చెందిన వస్తువులను పరిశీలించారు. శాంతిభద్రతలకు విఘాతం లేకుండా, నేరపూరిత అంశాలకు తావివ్వకుండా చర్యలు చేపట్టినట్లు సీఐ చెప్పారు.

బాధితుడికి పరామర్శ

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: గరుడాపురం గ్రామంలోని వ్యవసాయ క్షేత్రంలో విద్యుత్తు నియంత్రికకు ఫీజు వేస్తుండగా లోకేష్ అనే యువకుడు విద్యుత్తు ప్రమాదానికి గురై తీవ్రంగా గాయపడ్డాడు. అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా తెదేపా నాయకుడు కమ్మూరి నాగరాజు, కార్యకర్తలు ఆదివారం పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితులను వైద్యులను అడిగి తెలుసుకొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణ సమీపంలోని బళ్లారి రోడ్డులోని రామస్వామి ఆలయంలో నివాసం ఉంటున్న ముత్యాలప్ప సొంత పనులు ముగించుకొని ఇంటికివెళ్తుండగా వెనుక వైపు నుంచి వచిచన ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ఘటనలో పాదచారుడికి తలకు, శరీర భాగాల్లో తీవ్ర గాయాలు కాగా స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స నిర్వహించి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం అనంతపురం తీసుకెళ్లారు.

తెదేపా సభ్యత్వ నమోదుపై సమావేశం నేడు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని స్థానిక ప్రజావేదిక వద్ద సభ్యత్వ నమోదుపై సమావేశం నిర్వహిస్తున్నట్లు తెదేపా మండల కన్వీనర్ వెంకటేశులు ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. తెదేపా జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలు, ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు సూచనల మేరకు సోమవారం ఉదయం 10 గంటలకు సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మంగళగిరి పార్టీ కార్యాలయం నుంచి రీసోర్స్ పర్సన్ల సభ్యత్వ నమోదుపై సూచనలు, సలహాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. మండలంలోని గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు, క్లస్టర్ ఇన్‌ఛార్జీలు, ప్రధాన కార్యదర్శులు, బూత్‌లెవెల్ ఏజెంట్లు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు భాగస్వాములు కావాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

గుమ్మఘట్ట, న్యూస్‌టుడే: మండలంలోని కలుగోడు గ్రామానికి చెందిన జ్యోతి కుటుంబానికి రాయదుర్గం పట్టణానికి చెందిన మురళీకృష్ణ రూ.5 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా మురళీ మాట్లాడుతూ ఆడవారిపై అఘాయిత్యాలకు పాల్పడే వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

కొలిక్కిరాని శ్రీవారి రథం తయారీ

■ రెండేళ్లుగా భక్తుల ఎదురుచూపు

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ మండలం పెన్నహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయ నూతన రథం తయారీ ఓ కొలిక్కి రావడం లేదు. పనులను ఈ ఏడాది మార్చిలో ప్రారంభించారు. దేవదాయశాఖ దీనికి రూ.1.78 కోట్లు మంజూరు చేసింది. అందులో భక్తుల ద్వారా అందిన విరాళాలే రూ.కోటి. రథం పాత బడిందని, దాని నిర్వహణకు ఇబ్బందులు ఉన్నాయని ఆలయ అధికారుల పిలుపుతో నూతన రథం తయారీకి భక్తులు గత నాలుగైదు సంవత్సరాలుగా విరివిగా విరాళాలు ఇచ్చారు. దానికి అనుమతులు రాబట్టడంలో గత ప్రభుత్వంలోని పాలకులు, అధికారులు పెద్దగా చొరవ చూపలేదు. ఇంతలో రెండేళ్ల క్రితం మరమ్మతుల సమయంలో పాత రథం కూలి పోయి, ధ్వంసం అయ్యింది. గత బ్రహ్మోత్సవాల్లో దానికే మరమ్మతులు చేయించి, ఉత్సవాలను పూర్తి చేశారు. సాధారణ ఎన్నికల ముందు హడావుడిగా రథం తయారీని ప్రారంభించారు. పనులు అనుకున్నంత వేగంగా సాగడం లేదని భక్తులు వాపోతున్నారు. వచ్చే బ్రహ్మోత్సవాల నాటికైనా పూర్తవుతుందా? అన్న ప్రశ్నకు అధికార యంత్రాంగం వైపు నుంచి సమాధానం లేదు.

రథం పనుల్లో ఆచార్యులు

● కొత్త రథం తయారీ టెండరును గత ఏడాది అనంతపురానికి చెందిన ఓ వ్యక్తి దక్కించుకున్నారు. దాని తయారీ పనులను ఉరవకొండకు చెందిన ఉప గుత్తేదారుకు అప్పగించారు. వారు 8 నెలలుగా రథం తయారీ పనులను చేస్తున్నారు. వారు ఇప్పటికే రూ.60 లక్షలకు పైగా ఖర్చు పెట్టినట్లు తెలిసింది. కాని ఇప్పటివరకు వారికి గుత్తేదారు ఎలాంటి మొత్తాన్ని చెల్లించలేదని చర్చ. ఆ పనులను ఆపాలని గుత్తేదారు ఉప గుత్తేదారుకు సూచించినట్లు సమాచారం. వాటిని ఎందుకు ఆపమన్నారు? దానికి వెనుక ఉన్న ఆంతర్యం ఏమిటన్న విషయంపై స్పష్టత లేదు.

ఏడాదిలోపు పూర్తి చేయిస్తాం

- రమేశ్‌బాబు, ఆలయ ఈవో, పెన్నహోబిలం

కొత్త రథం తయారీని ఇప్పటి నుంచి ఏడాది లోపు పూర్తి చేయిస్తాం. దాని తయారీలో నాణ్యతకు ప్రాధాన్యం ఇవ్వాలన్నది మా ఆలోచన. ఇప్పటి వరకు జరిగిన రథం తయారీ పనిని దేవదాయ ఇంజినీరింగు అధికారులు, ఉన్నతాధికారులు పరిశీలించిన తరువాత వారి నిర్ణయం మేరకు మిగతా పనిని వేగవంతం చేసే దిశగా ప్రత్యేక చొరవ చూపుతాం

మందు పిచికారీతో అస్వస్థత.. కౌలు రైతు మృతి

కణేకల్లు, న్యూస్‌టుడే: వరి పొలానికి పురుగుల మందు పిచికారీ చేస్తూ.. తీవ్ర అస్వస్థతకు గురైన కౌలు రైతు విజయ్‌కుమార్(33) మృతి చెందిన సంఘటన ఆదివారం మండలంలోని మాల్యం గ్రామంలో చోటు చేసుకొంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిన వివరాలు. రామన్న, వన్నూరుస్వామి, విజయ్‌కుమార్‌లు ముగ్గురు కలసి 4 ఎకరాలు కౌలుకు తీసుకొని వరి సాగు చేశారు. ఈ సందర్భంగా ఆదివారం వరి సస్యరక్షణకు పురుగు మందు పిచికారీ చేసేందుకు ముగ్గురు కలసి పొలానికి వెళ్లారు. విజయ్‌కుమార్ జాగ్రత్తలు పాటించకుండా చేతితో పురుగు మందు కలిపి రోజు వారీ అలవాటులో భాగంగా అదే చేతిలో పొగాకు రుద్ది నోటిలో పెట్టుకొని వారిద్దరితో కలసి పొలానికి మందు పిచికారీ చేశాడు. కాసేపటికి విజయ్‌కుమార్ అస్వస్థకు గురి కావడంతో గమనించిన ఇద్దరు రైతులు బాధితుడిని చికిత్స నిమిత్తం వెంటనే స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రానికి తరలిస్తుండగా మార్గం మధ్యలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఇతనికి నలుగురు కూతుర్లు ఉన్నారు. భార్య శివమ్మ ప్రస్తుతం మూడు నెలల గర్భిణి. కూలీ పనులు చేసుకొంటున్న కుటుంబం పెద్ద దిక్కును కోల్పోవడంతో భార్యాపిల్లలు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. దీంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకొన్నాయి.

విజయ్‌కుమార్

పోలీసుల తనిఖీలు

రాయదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: ఆవులదట్లలో రాయదుర్గం అర్బన్ సి.ఐ జయనాయక్ ఆధ్వర్యంలో పోలీసులు ఆదివారం తనిఖీలు నిర్వహించారు. కర్ణాటక మద్యం విక్రయాలకు పాల్పడే వారి ఇళ్లను, మట్కా, జూదం ఆడేవారిని తనిఖీ చేశారు. అనుమానాస్పద వ్యక్తులు, పాత నేర స్థుల ఇళ్లల్లో, రికార్డులు లేని వాహనాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి జి.వన్నూరుస్వామి, గ్రామ ప్రజలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

అంధకారంలో కొత్తపల్లి

బొమ్మనహాళ్, న్యూస్‌టుడే: మండలంలోని దర్గాహొన్నూరు పంచాయతీ పరిధిలోని కొత్తపల్లి గ్రామంలో గత రెండు నెలల నుంచి విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతున్నా అధికారులు ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్థులు వాపోయారు. రోజూ రాత్రివేళలో ఫ్యూజ్ పోయినా విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించడానికి కనీసం హెల్పర్ కూడా లేరన్నారు. గత పది రోజుల నుంచి విద్యుత్తు సరఫరా నిలిపి వేయడంతో ప్రజలు దోమల మధ్యన జాగరణ చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. విద్యుత్తుశాఖ అధికారులకు విన్నవించుకున్నా పట్టించుకోవడం లేదని గ్రామానికి చెందిన హనుమంతు వాపోయారు. గ్రామంలో విద్యుత్తు కనెక్షన్లు ఎక్కువగా ఉన్నా ఒక సింగల్ పేజ్ నియంత్రికలో లోడ్ అధికమై తరచూ విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలుగుతోందన్నారు. ప్రభుత్వం తగు చర్యలు తీసుకుని వెంటనే అదనపు సింగిల్ పేజ్ విద్యుత్తు నియంత్రికను ఏర్పాటు చేసి సరఫరాకు అంతరాయం లేకుండా చూడాలని గ్రామస్థులు కోరారు. ఈ విషయంపై విద్యుత్తు ఏఈఈ లక్ష్మిరెడ్డి దృష్టికి తీసుకుని వెళ్లగా పరిశీలించి విద్యుత్తు సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం

రాయదుర్గం పట్టణం, గ్రామీణం, న్యూస్‌టుడే: పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం భద్రంగా ఉంటుందని ఎన్ఎస్ఎస్ పీవోలు నారాయణ, కోదండరాములు, గోవర్ధన్, ఎన్‌సీసీ సీటీవో కిరణ్ తెలిపారు. ఆదివారం పట్టణంలోని కేటీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సంబంధించిన ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ బృంద సభ్యులు మండలంలోని ఆయతపల్లిలో స్వచ్ఛతా హీ కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. పాఠశాల, పంచాయతీ కార్యాలయం, గ్రామ వీధుల్లో ఉన్న చెత్తను తొలగించారు. ముళ్లకంపలు, పిచ్చి మొక్కలను తొలగించి, వృథాగా పడేసిన ప్లాస్టిక్‌ను సేకరించారు. ప్లాస్టిక్ వినియోగంతో జరిగే అనర్థాలు ప్రజలకు వివరించారు.

నేడు ఈకేవైసీ నమోదుకు ఆఖరు

కుందుర్పి, న్యూస్‌టుడే: మండలంలో పంటలు సాగు చేసిన రైతులంతా సోమవారం సాయంత్రం లోపు ఈకేవైసీ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి మహేష్ రైతులను కోరారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలం వ్యాప్తంగా 16 గ్రామ సచివాలయాల పరిధిలోని రైతులు ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో రైతులు వివిధ రకాల పంటలు సాగు చేసి, వ్యవసాయ సహాయకులతో ఈ పంటల యాప్‌లో నమోదు చేయించుకున్న రైతులు ఇప్పటి వరకే వందాలాది మంది ఈకేవైసీ చేయించుకోలేదన్నారు. సోమవారం సాయంత్రం లోగా ఆయా గ్రామాల్లోని రైతు సేవాకేంద్రాల్లోని వ్యవసాయ సహాయకుల వద్ద ఈకేవైసీ (వేలిముద్రలు) చేయించాలన్నారు. ఈకేవైసీ చేయించుకోని రైతులకు ప్రభుత్వం అందించే పెట్టుబడిరాయితీ, నష్టపరిహారం పొందడానికి అనర్హులవుతారన్నారు.

కుందుర్పి రైతు సేవా కేంద్రం చిత్రం

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులును సన్మానిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

తెదేపాతోనే బీసీల అభ్యున్నతి

అనంతపురం (కళ్యాణదుర్గంరోడ్డు), న్యూస్‌టుడే : బీసీలకు అభ్యున్నతి తెదేపా ప్రధాన ఉద్దేశమని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం అనంతపురం నగరంలోని స్వగృహంలో పద్మశాలి సంక్షేమ సంఘం నాయకులు ఎమ్మెల్యేకు శ్యాలువా కప్పి సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కష్టకాలంలో పనిచేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందన్నారు. పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర సభ్యుడిగా అనంతవాసిని ఎంపిక చేయడానికి సహకరించిన ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర సభ్యుడు లక్ష్మీనరసింహులు, సంఘం నాయకులు సత్యనారాయణ, మంజునాథ, విశ్వనాథ, పాల్గొన్నారు.

వాల్మీకి కూడలిలో గుమిగూడిన ఇరువర్గాలు

ఘర్షణకు దిగిన జూదరులు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని స్థానిక వాల్మీకి కూడలిలో జూదర్లు ఒకరిపై ఘర్షణకు దిగారు. ఈఘటన ఆదివారం రాత్రి జరిగింది. పట్టణానికి చెందిన కొందరు కొన్ని నెలల కిందట పాలవాయికి చెందిన వారిని జూదం ఆడుతుండగా పోలీసులకు సమాచారం ఇచ్చారన్నారు. దీన్ని మనస్సులో ఉంచుకొని వారు వాల్మీకి కూడలి చేరుకొని తిట్టుకొంటుండగా దాంతో ఇరు వర్గాలకు చెందిన వారు ఘర్షణకు దిగారు. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొనే సరికి ఇరువర్గాలకు చెందిన వారు పరారయ్యారు.

ఆదమరిస్తే అంతే

మండల కేంద్రంలోని రోడ్డు భవనాల శాఖ ప్రధాన రహదారిపై స్థానిక కుమ్మరవీధి ములుపు వద్ద సీసీ రహదారిపై గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. మలుపులో పడిన గుంతతో రాత్రి పూట ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నట్లు కుమ్మర వీధి ప్రజలు తెలిపారు. ఇప్పటికైనా మలుపు వద్ద ఏర్పడిన గుంతలను పూడ్చి, ప్రమాదాలు అరికట్టాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు. -న్యూస్‌టుడే, కుందుర్పి

బండి కదలదు.. చెత్త తొలగదు

పంచాయతీకి కేటాయించిన ట్రాక్టర్లు మరమ్మతులకు గురయ్యాయి. ప్రతి రోజూ వాహనాన్ని తోస్తే తప్ప ముందుకు కదలని పరిస్థితి కొనసాగుతోంది. ఫలితంగా సకాలంలో చెత్త సేకరణ జరగడం లేదు. దీంతో చెత ఎక్కడికక్కడ పేరుకుపోతోంది. వీధుల్లో దుర్గంధం వెదజల్లుతోంది. ఆదివారం ఉదయం చిన్న పాటి వర్షం రావడంతో బండి మొరాయించింది. దీంతో బండి కదలక.. చెత్తా చెదారం తొలగక, చివరికి వర్షంలో చెత్తా, చెదారం ఎక్కడికక్కడ వదిలేసి వెళ్లిపోయారు. దీనిపై సంబంధిత పంచాయతీ కార్యదర్శి రాఘవేంద్రతో ప్రస్తావించగా త్వరితగతిన వాహనం మరమ్మతులు చేయించి సమస్య పునరావృతం కాకుండా చూస్తామని చెప్పారు.

- న్యూస్‌టుడే, కంబదూరు

శుభ్రత చర్యలు.. విజ్ఞాన యాత్ర

ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న అనంతపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (ఆర్ట్స్) ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు

ఉరవకొండ, న్యూస్‌టుడే: పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామి ఆలయ పరిసరాల్లో ఆదివారం వివిధ విద్యాలయాలకు చెందిన విద్యార్థుల సందడి కనిపించింది. అనంతపురం ప్రభుత్వ డిగ్రీ(ఆర్ట్స్) కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్, ఎన్‌వైకే వాలంటీర్లు ఆలయ పరిసరాల్లో శుభ్రత చర్యలను చేపట్టారు. ప్రధానంగా ప్లాస్టిక్ సంబంధ వస్తువులను శుభ్రం చేశారు. అవి ఇక్కడి పరిసరాల్లో పెరిగి పోవడం వల్ల అపరిశుభ్రత పెరగడంతో పాటు, వాతావరణ కాలుష్యం ఏర్పడకుండా ఉండాలన్న ఉద్దేశంతో ఈ చర్యలను చేపట్టినట్లు ఎన్ఎస్ఎస్ పీవో విష్ణుప్రియ చెప్పారు. మరో వైపు వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు విజ్ఞాన యాత్ర పేరుతో శ్రీవారి ఆలయానికి వచ్చారు. వారికి ఆలయ విశిష్టతను, దాని చరిత్రను ఉపాధ్యాయులు వివరిస్తూ కనిపించారు. పరిసరాల్లో పెరిగిన వివిధ రకాల చెట్లు, తిరుగుతున్న పక్షులు, జలపాతాల గురించి వారికి తెలియ చేస్తూ వారిలో విజ్ఞానాన్ని పెంచే ప్రయత్నం చేశారు.

పచ్చని వాతావరణం మధ్య భోజనం చేస్తున్న విజ్ఞాన యాత్రకు వచ్చిన విద్యార్థులు

తిరుపతి లడ్డూ కల్తీపై విచారణకు డిమాండ్

రాయదుర్గం, న్యూస్‌టుడే: హిందువులు పరమ పవిత్రంగా భావించే తిరుపతి లడ్డూ తయారీలో జంతువుల కొవ్వు అవశేషాలు కల్తీ చేసి హిందువుల మనోభావాలను దెబ్బతీశారని బాజపా జిల్లా కార్యదర్శి నాని, కిషాన్‌మోర్చా విభాగం జిల్లా కోకన్వీనర్ వేణుగోపాల్ రాయ్, నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలోని రాజీవ్‌గాంధీ కాలనీలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద కిషాన్ మోర్చా ఆధ్వర్యంలో గోవు గోష వినుగోవింద అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గోవుకు హూజలు జరిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తిరుపతి లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వ్యవహారంపై సుప్రీం కోర్టు న్యాయ మూర్తితో విచారణ జరిపించి దోషులను వీలైనంత త్వరగా గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీల సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటిని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించడానికి కృషి చేయాలని ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్, మానటరింగ్ కమిటీ సభ్యుడు కౌకుంట్ల రవిని ప్రజా సంఘాల నాయకులు కోరారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వ విశ్రాంత భవనంలో ఆయనను ప్రజా సంఘాల నాయకులు ఘనంగా సత్కరించారు. ప్రభుత్వం కల్పించిన అవకాశంతో దళిత, గిరిజనులకు దగ్గరగా ఉండి, వారి సమస్యలపై దృష్టి పెట్టాలన్నారు.

రవిని సత్కరిస్తున్న ప్రజాసంఘాల నాయకులు

మళ్లీ సమ్మెబాటలోకి కార్మికులు

కళ్యాణదుర్గం గ్రామీణం, న్యూస్‌టుడే: జీతాలు ఇవ్వాలంటూ గతంలో సమ్మె చేపట్టామని ఆ సమయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు విధుల్లోకి వెళ్లామని, ఇప్పటి వరకు జీతాలు ఇవ్వక పోవడం ఏమిటని కార్మికులు ప్రశ్నించారు. ఆదివారం శ్రీరామిరెడ్డి నీటి పథకం పంప్ హౌస్ వద్ద నీటి సరఫరాను బంద్ చేసి మెరుపు సమ్మె చేపట్టారు. గతంలో ఉన్న గుత్తేదారు కార్మికులకు నెలకు రూ.16,500 ఇచ్చే వారని, ప్రస్తుతం ఉన్న గుత్తేదారు శివ శంకర్‌రెడ్డి రూ.2,500 కోత విధించి రూ.14వేలు మాత్రమే జీతాలు ఇస్తున్నారన్నారు. గతంలో సమ్మెలు, నిరసనలు చేపట్టిన సమయంలో 20 మంది కార్మికులకు 17 మందికి నాలుగు నెలలు, 5 మందికి 9 నెలల జీతాలు ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కరించేంత వరకు విధుల్లోకి చేరమని వారు భీష్మించారు.

నీటి పథకం వద్ద సమ్మె చేస్తున్న కార్మికులు

దుర్వాసన భరించతరమా?

అధ్వానంగా ప్రయాణ ప్రాంగణం

ఉరవకొండ, న్యూస్‌టుడే: ఉరవకొండ పట్టణ నడిబొడ్డున ఉన్న పాత ప్రయాణ ప్రాంగణం అపరిశుభ్రతకు, దుర్వాసనకు చిరునామాగా మారింది. వర్షం పడితే అక్కడ భారీగా వర్షం నీరు నిలుస్తాయి. అవి బయటికి పోయే మార్గాన్ని అధికారులు ఏర్పాటు చేయలేదు. ఒకసారి వర్షం పడితే పదిహేను రోజులు అక్కడ నీటి నిల్వ ఉంటోది. వాటిలో చెత్తాచెదారం పేరుకుపోయి దుర్గంధంగా మారుతుంది. ఆ ప్రాంతమే ప్రధాన వాణిజ్య సముదాయం. రోజూ వేల సంఖ్యలో ప్రజలు, వాహనదారులు ఆ ప్రాంగణంలో రాకపోకలు సాగిస్తుంటారు. అక్కడ ఏ మాత్రం పొరబడినా ఆ నీళ్లలో పడిపోవడం జరుగుతుంది. దుర్వాసన మధ్యనే ప్రజలు ఇక్కట్లు పడుతున్నా, పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు. అక్కడ నీరు నిల్వ ఉండకుండా శాశ్వత చర్యలను చేపట్టింది లేదు. పంచాయతీ కార్యదర్శి గౌస్ సాహెబ్ దృష్టికి తీసుకుపోగా, ఆ సమస్యను శాశ్వతంగా పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతామన్నారు.

పాత ప్రయాణ ప్రాంగణంలో నిలిచిన నీరు

ఇంటింటా మొక్క.. ఊరంతా వనం

ఉరవకొండ, న్యూస్‌టుడే: ప్రతి ఇంటి ముందు మొక్కను నాటి, దానిని సంరక్షిస్తే భవిష్యత్తులో ఊరంత వనంగా మారడానికి అవకాశం ఉందని నిస్వార్థ ఫౌండేషన్ సమన్వయకర్త వెంకట, అనంతపురానికి చెందిన గ్రీన్ ఆర్మీ వ్యవస్థాపకుడు అనిల్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. నిస్వార్థ విద్యా వికాస శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందుతున్న విద్యార్థుల చేత పట్టణంలోని ఎస్ఎల్ఎన్ కాలనీలో ఆదివారం మొక్కలను నాటించారు. వాటిని విద్యార్థుల ఇళ్ల ముందరే నాటించి, వాటిని పెంచే బాధ్యతను చూసేలా వారికి అప్పగిస్తూ, వాటి పర్యవేక్షణను నిస్వార్థ సభ్యులు తీసుకున్నారు. మొక్కలు బాగా పెంచిన మొదటి పది మంది విద్యార్థులకు వచ్చే పంద్రాగస్టు రోజు ఒక్కొక్కరికి రూ.వెయ్యి నగదు బహుమతి ఇవ్వనున్నట్లు ప్రకటించారు. మొక్కల పెంపకాన్ని నిరంతర కార్యక్రమంగా చేపట్టినట్లు వారు తెలిపారు.

విద్యార్థి ఇంటి వద్ద మొక్క నాటిస్తున్న నిస్వార్థ ఫౌండేషన్ సభ్యురాలు సునీత

యువత సన్మార్గంలో నడవాలి

కళ్యాణదుర్గం, న్యూస్‌టుడే : మాదక ద్రవ్యాలు, వ్యసనాలతో యువత పెడదోవ పట్టకూడదని ఎస్‌వీజీఎం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ శ్రీధర్ పేర్కొన్నారు. ఆదివారం బీసీ బాలికల కళాశాల వసతి గృహంలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మాదకద్రవ్యాల ప్రభావం, అక్రమ రవాణా అనే అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వసతి గృహ వార్డెన్ పద్మావతి, అధ్యాపకులు రవిశంకర్, గోపీ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీధర్

కేరళ వరద బాధితులకు విరాళం

కుందుర్పి, న్యూస్‌టుడే: కేరళ రాష్ట్ర వరద బాధితులకు మండలంలోని ఎస్‌కే ఛారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు లెనిన్ బాబు, ట్రస్టు తరఫున రూ.17 వేల చెక్కును ఆదివారం అనంతపురంలో జరిగిన ఓ కార్యక్రమంలో కేరళ రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు, వ్యవసాయ శాస్త్రవేత్త పీకే రామచంద్రన్‌కు అందించారు.

చెక్కు అందిస్తున్న లెనిన్ బాబు

20వ వర్ధంతి

"మీరు ఒక స్ఫూర్తి ప్రదాత, ఒక గొప్ప తండ్రిగా, కుటుంబ పెద్దగా మమ్మల్ని ప్రేమతో కాపాడినవారు, ఒక నాయకుడిగా ప్రజలను మార్గనిర్దేశం చేసినవారు. మీ ముందు చూపుతో, దార్శనికతతో ఎంతో మంది జీవితాలకు వెలుగునిచ్చారు. సేవాభావంతో, దాతృత్వంతో సామాజిక సేవలో మీ స్థానం పటిష్టం చేశారు. మీ ఆశయాలు, ఆలోచనలు తరతరాలకు మార్గదర్శకాలు అవుతాయి." మీరు చూపిన బాటలో వెలుగులు నింపుకుంటూ, మీ జ్ఞాపకాల స్ఫూర్తితో ముందుకు సాగుతాం.. మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆ దేవున్ని ప్రార్థిస్తూ..

కీ॥శే॥ పాటిల్ మల్లన్న గౌడ్ గారు

EX సమితి ప్రెసిడెంట్,

యనుములదొడ్డి గ్రా॥, కుందుర్పి మం॥

కోతుర్లు, అల్లుర్లు, మనీవేర్లు, మనీవరాల్లు, బంధుమిత్రులు, మరియు శ్రేయోజిలాషులు

కుమారులు

శ్రీమతి & శ్రీపి.సోమశేఖర్

గుంతకల్లు

• గుంతకల్లు • శింగనమల • తాడిపత్రి

అలంకరణలో అశ్వర్థనారాయణస్వామి

అశ్వర్థ ఆలయంలో విశేష పూజలు

పెద్దపప్పూరు, న్యూస్‌టుడే: మండలంలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన అశ్వర్థ ఆలయంలో ఆదివారాన్ని పురస్కరించుకొని విశేష పూజలు నిర్వహించారు. అశ్వర్థనారాయణస్వామి, శ్రీచక్రభీమలింగేశ్వరస్వామి వారికి అభిషేక పూజలు, అర్చనలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

ఫ్యాక్షన్ గ్రామంలో సోదాలు

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: మండలంలోని ఫ్యాక్షన్ గ్రామమైన మేడిమాకులపల్లిలో ఆదివారం పోలీసులు సోదాలు నిర్వహించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఎస్సై చిన్నరెడ్డెప్ప ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీసు బలగాలతో అనుమానితుల ఇళ్లు, వామిదొడ్లు, తదితర ప్రాంతాల్లో సోదాలు చేపట్టారు. అనంతరం శాంతిభద్రతలపై ప్రజలకు ఎస్సై అవగాహన కల్పించారు. ఆయన వెంట ఏఎస్సై నారాయణనాయక్, తదితరులు ఉన్నారు.

మేడిమాకులపల్లిలో సోదాలు చేస్తున్న పోలీసులు

సంక్షిప్త సమాచారం

నీట మునిగి యువకుడి మృతి

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రి పట్టణ పరిసరాల్లోని వరాలుతోట సమీపంలోని పెన్నానదిలోని నీటి కుంటలో యువకుడు నీట మునిగి మృతి చెందిన ఘటన ఆదివారం జరిగింది. గ్రామీణ సీఐ తెలిపిన వివరాల మేరకే పట్టణంలోని సజ్జలదిన్నె నాపరాళ్ల పరిశ్రమలో ఉమాశంకర్, సుమలతల కుమారుడు హర్షవర్ధన్(18) భవన నిర్మాణ కార్మికుడిగా పనిచేస్తుండేవాడు. ఆదివారం సెలవురోజు కావడంతో స్నేహితులతో కలిసి పెన్నానది కొత్త పాత వంతెన సమీపంలోని సజ్జలదిన్నె గ్రామ సమీపంలోని పెన్నానది నదిలో ఉన్న నీటి కుంటలో ఈత కోసం వెళ్లాడు. హర్షవర్ధన్‌కు ఈత రాకపోయినా నీళ్లలోకి దిగడంతో నీట మునిగి మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. మృతదేహాన్ని బయటకు తీసి స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ వివరించారు.

గడ్డివామి దగ్ధం

పామిడి: ఎదురూరు గ్రామంలో రైతు రామకృష్ణకు చెందిన గడ్డివామి దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఆదివారం తెల్లవారుజామున గడ్డివాముకు నిప్పు అంటుకుంది. స్థానికులు మంటలను ఆర్పేందుకు ప్రయత్నించారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో వచ్చి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. ఈ ప్రమాదంలో సుమారు.2లక్షలు ఆస్తి నష్టం వాటిల్లిందని రైతు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇరువురుకి గాయాలు

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రి మండలంలోని ఆర్జాస్ ఉక్కు పరిశ్రమ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇరువురికి గాయాలైన ఘటన చోటు చేసుకుంది. గ్రామీణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు కడపకు చెందిన అరవింద్, సుబ్బరాయుడు సొంత పనినిమిత్తం తాడిపత్రికి ద్విచక్రవాహనంలో బయలుదేరారు. ఆర్జాస్ ఉక్కు పరిశ్రమ వద్దకు రాగానే గుర్తు తెలియని లారీ ఎదురుగా వచ్చి డీ కొనడంతో ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి.

ఏడుగురు జూదరుల అరెస్టు

తాడిపత్రి: తాడిపత్రిలోని నంద్యాల రోడ్డులోని ఓ పెట్రోలు బంకు వెనకాల జూదం ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు గ్రామీణ సీఐ శివగంగాధర్‌రెడ్డి తెలిపారు. వీరిని నుంచి రూ.32,280 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల జప్తు

యాడికి, న్యూస్‌టుడే: అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఒక ట్రాక్టరును జప్తు చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. పెద్దపప్పూరు మండలం జూటూరు సమీపంలోని పెన్నా నది నుంచి ఇసుక వేసుకుని వస్తుండగా మార్గమధ్యలో నిట్టూరు క్రాస్‌లో ట్రాక్టరును పట్టుకున్నారు. వాహన యజమాని, డ్రైవరుపై కేసు నమోదు చేశామని సీఐ చెప్పారు.

గార్లదిన్నె: కమలాపురం గ్రామ సమీపంలో ఆదివారం ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. కొప్పలకొండ గ్రామ సమీపంలో పెన్నా నది నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తుండగా అందిన సమాచారం మేరకు పోలీసులు పట్టుకుని స్టేషన్‌కు తరలించారు.

వేర్వేరు చోట్ల ఇద్దరి అదృశ్యం

పామిడి, న్యూస్‌టుడే: పామిడి పట్టణంలో ఓ 17 ఏళ్ల బాలిక అదృశ్యంపై ఆదివారం కేసు నమోదైయింది. పోలీసుల వివరాల మేరకు పట్టణంలోని ఓ వీధికి చెందిన బాలిక శనివారం ఇంటి నుంచి వెళ్లిపోయింది. ఆచూకీ లభ్యంకాకపోవడంతో ఆదివారం పామిడి పోలీసు స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

గార్లదిన్నె: మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన వివాహిత అదృశ్యమైనట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మూడు రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లి పోవడంతో బంధువుల గ్రామాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. వివాహిత తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు.

వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

యల్లనూరు, న్యూస్‌టుడే: యల్లనూరులోని కోట కాలనీలో నివాసముంటున్న దాదాబాషాను ఇంటి పక్కనే నివాసముంటున్న మంగలి శివ రస్తా విషయంలో గొడవపడి దాడి చేశాడు. ఈఘటనతో గాయాల పాలైన దాదాబాషాను చికిత్స నిమిత్తం తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రాంప్రసాద్ తెలిపారు.

పిడుగు పడి 17 గొర్రెల మృతి

గుత్తి గ్రామీణ, న్యూస్‌టుడే: చెర్లోపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి పిడుగు పడి 17 గొర్రెలు మృతిచెందగా, 8 ప్రాణాపాయస్థితిలో ఉన్నాయి. నలుగురు కాపరులు తమ గొర్రెలను మేతకు తీసుకువెళ్లి ఊరి బయట మందలో ఉంచారు. ఉరుములు,మెరుపులతో వర్షం కురిసింది. ఆ మందపై పిడుగు పడింది. ఈఘటనలో కాపరులు పరుగులు తీసి ప్రాణాలను కాపాడుకున్నారు. ప్రాణాలతో బయటపడిన కాపరులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు.

'ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాల్సిందే'

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: కొర్రపాడు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న విజయలక్ష్మిని వెంటనే సస్పెండ్ చేయాలని కేవీపీఎస్, ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండు చేశారు. ఆదివారం పాత్రికేయుల సమావేశంలో కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప మాట్లాడుతూ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న కొర్రపాడు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్, ఆమెను ప్రోత్సహిస్తున్న డీసీవో మురళీకృష్ణను తక్షణమే సస్పెండ్ చేయాలన్నారు. జిల్లా కార్యదర్శి వెంకటేష్, పుల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

కలగా భూగర్భ మురుగు కాలువ వ్యవస్థ

➠ అస్తవ్యస్తంగా ఏళ్ల నాటి నిర్మాణాలు ➠ ప్రజలకు తప్పని పాట్లు

గుంతబావి రైల్వేమోరీ వద్ద అధ్వానంగా మురుగు కాలువ

గుంతకల్లు, గుత్తి, న్యూస్‌టుడే: గుంతకల్లు, గుత్తిలో మురుగు కాలువల వ్యవస్థ అధ్వానంగా ఉంది. వర్షం పడితే కాలువలు పొంగి రోడ్ల మీద మురుగు ప్రవహిస్తోంది. ప్రధానంగా గుంతకల్లులో 50 ఏళ్ల కిందట నిర్మించిన మురుగు కాలువలే నేటికీ దిక్కయ్యాయి. ఇళ్లు, జనాభా పెరిగినా ఇందుకు అనుగుణంగా కాలువలను విస్తరించలేదు. జోరుగా వర్షం పడితే చిన్న మురుగు కాలువల నుంచి మురుగు రోడ్ల పైకి వస్తోంది. బెంచికొట్టాల, మస్తాన్‌పేట, కొత్తకొట్టాల, తిలక్‌నగర్, బీఎస్ఎన్ కాలనీల్లో ఇలాంటి పరిస్థితి ఉంది. కాలువలు శుభ్రం చేయడానికి ఏటా రూ. 50 లక్షలకు పైన ఖర్చు చేయాల్సిన వస్తోంది.

280 కోట్లతో ప్రత్యేక ప్రణాళిక

గుంతకల్లులో మురుగు కాలువల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో అప్పట్లో తెదేపా ప్రభుత్వ హయాంలో భూగర్భ మురుగు కాలువల వ్యవస్థను ఏర్పాటు చేయడానికి ఇంజినీర్ల బృందంతో సర్వే చేయించారు. కాలువల నిర్మాణానికి రూ.280 కోట్లు అవసరమవుతాయని ఇంజినీర్లు తయారు చేసిన ప్రణాళికలో పొందుపరిచారు. దీన్ని 2018లో కోడెల అపర్ణ మున్సిపల్ అధ్యక్షురాలిగా ఉన్న సమయంలో కౌన్సిల్ సమావేశంలో తీర్మానాన్ని ఆమోదించారు. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛభారత్ పథకం కింద నిధులను కేటాయించాలని కోరుతూ కౌన్సిల్ తీర్మానించి తీర్మానాన్ని రాష్ట్రప్రభుత్వానికి పంపారు. తరువాత తెదేపా ప్రభుత్వం అధికారాన్ని కోల్పోవడంతో వైకాపా ప్రభుత్వం ప్రణాళిక గురించి ఏమాత్రం పట్టించుకోలేదు. మళ్లీ తెదేపా ప్రభుత్వం రావడంతో ఆశలు చిగురించాయి.

✦ గుత్తిలో భూగర్భ మురుగు కాలువల వ్యవస్థను ఏర్పాటు చేయడానికి అధికారులు రూ.100 కోట్లతో ప్రణాళిక తయారు చేశారు. నిధులు కేటాయించాలని కోరుతూ 2018 సంవత్సరంలో ప్రభుత్వానికి నివేదించారు. ఐదు సంవత్సరాలు అవుతున్నా అతీగతీ లేదు. ఫలితంగా వర్షాలు పడిన ప్రతిసారి మురుగు రహదారులపైకి వస్తోంది. ఫలితంగా జనం ఇబ్బంది పడుతున్నారు.

నిధుల కోసం నివేదిస్తాం

- భవానీ, మున్సిపల్ అధ్యక్షురాలు, గుంతకల్లు

భూగర్భ మురుగు కాలువల వ్యవస్థ ఏర్పాటుకు గతంలో రూపొందించిన ప్రణాళికను బయటగికి తీసి దాన్ని అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరతాం. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నుంచి నిధులను విడుదల చేసే విధంగా చూడడానికి మేము ఒత్తిడి తీసుకొస్తాం. పట్టణంలో మురుగు కాలువల వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తాం.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM to 1 PM)
గుంతకల్లు పట్టణం: 80085 73072
తాడిపత్రి: 79950 67001
శింగనమల: 99897 94244

సమస్య: గుంతకల్లులోని హంపయ్యకాలనీలోని పార్కు మందుబాబులకు అడ్డాగా మారింది. **- శేఖర్, స్థానికుడు**
సమాధానం: పరిశీలించి చర్యలు తీసుకుంటాం. **- హరికృష్ణ, ఏఈ**
సమస్య: గుంతకల్లులోని రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రాథమిక పాఠశాల ముఖ ద్వారం వద్ద మురుగు ప్రవహిస్తోంది. **- హరీష్, స్థానికుడు**
సమాధానం: కాలువల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతాం. **- హరికృష్ణ, ఏఈ - న్యూస్‌టుడే, గుంతకల్లు పట్టణం**
సమస్య: శింగనమల మండలం పెరవలి గ్రామ ప్రధాన రోడ్డు గుంతలు పడింది. **- శ్రీనాథ్, పెరవలి**
సమాధానం: క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరిస్తాం- నిర్మల కుమారి, ఎమ్పీడీవో **- న్యూస్‌టుడే, శింగనమల**

వీధి దీపాల ఏర్పాటు

శింగనమల : శింగనమలలో వీధి దీపాలను ఏర్పాటు చేశారు. 'మేమున్నాం.. మీకుతోడుగా' శీర్షిక కింద వచ్చిన వార్తలకు ఎమ్పీడీవో నిర్మలకుమారి స్పందించారు. గత రెండు రోజులుగా గ్రామంలో వీధి దీపాలను వేయిస్తున్నారు.

ప్రహరీ నిర్మించరూ!

పెద్దవడుగూరు చేనేత కాలనీ సమీపంలోని డిపెప్ పాఠశాలకు సంబంధించి ప్రహరీ దెబ్బతిని పడిపోయింది. దీన్ని పదేళ్ల కిందట నిర్మించారు. ప్రహరీ లేక విషపురుగులతోపాటు పశువుల సంచారం ఎక్కువైంది. దీనికి తోడు మందుబాబులకు పాఠశాల ప్రాంగణం అడ్డాగా మారింది. పాఠశాలలో సుమారు 50 మంది విద్యార్థులు చదువుతున్నారు. దీనిపై మండల విద్యాధికారి రాముడును వివరణ కోరగా ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు పంపుతాం. నిధులు రాగానే సమస్యను పరిష్కరిస్తాం. **- న్యూస్‌టుడే, పెద్దవడుగూరు**

సీసీ రోడ్డుకు మోక్షమెన్నడో?

తాడిపత్రి, న్యూస్‌టుడే: తాడిపత్రి పురపాలికలోని టైలర్స్ కాలనీలో ప్రధాన రహదారిపై గత వైకాపా ప్రభుత్వం ఎలాంటి ప్రణాళిక లేకుండా భూగర్భ మురుగు నీటి కాలువ మరమ్మతల కోసం సీసీ రహదారులను తవ్వారు. అనంతరం ప్రజలకు ఇబ్బందులు కగలకుండా తెదేపా కౌన్సిలర్లు మురుగు సమస్యను పరిష్కరించి గుంతలను మట్టితో గుంతలు పూడ్చారు. మట్టిరోడ్డు కావడంతో వాహన రాకపోకలతో మళ్లీ గుంతలు పడ్డాయి. పురపాలక ఏఈ తేజను వివరణ కోరగా త్వరలో పనులు చేపట్టి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

శిథిలావస్థకు చేరిన వసతి గృహం

120 మంది పిల్లలు.. భయంగా చదువులు

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే: ఇసురాళ్లపల్లి గ్రామంలోని బీసీ వసతి గృహం శిథిలావస్థకు చేరింది. ఇక్కడ 120 మంది పిల్లలు ఆశ్రయం పొందుతున్నారు. ఇక్కడ మరుగుదొడ్లు, తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. భవనం పైకప్పు, గోడలు, ఇతరత్రా కట్టడాలు పెచ్చులూడిపోయాయి. భవనం ఒకవైపు కూలిపోయింది. గత వైకాపా ప్రభుత్వం కనీసం మరమ్మతులు చేపట్టిన పాపానపోలేదు. దీంతో విద్యార్థులు భయం భయంగా ఆశ్రయం పొందుతున్నారు. ఇటీవల వర్షాలు పడుతుండటంతో పరిస్థితి జరిలంగా మారింది. భవనం అంతా కారుతుండటంతో ఎప్పుడు కూలిపోతుందోనని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పిల్లలు రాత్రిళ్లు శ్రద్ధగా చదువుకోలేని పరిస్థితి కొనసాగుతోందని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాత్కాలికంగా మరోచోటికి వసతి గృహాన్ని మార్చాలని వారు కోరుతున్నారు.

పాలంలో కొండచిలువ

పెద్దవడుగూరు, న్యూస్‌టుడే: లక్షంపల్లిలో రైతు గోపాల్‌రెడ్డికి చెందిన పొలంలో ఆదివారం కొండచిలువ కనిపించడంతో కూలీలు భయాందోళనకు గురయ్యారు. మేడిమాకులపల్లికి వెళ్లే రహదారిలో ఉన్న రైతు పొలంలో కొర్రపంటను సాగుచేయగా అందులో కూలీలతో కలుపు మొక్కలను తొలగిస్తున్న తరుణంలో కొండచిలువ ప్రత్యేక్షం కావడంతో కూలీలు భయాందోళన చెందారు. రైతులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా వారొచ్చి తీసుకెళ్లారు.

తూనికలు, కొలతల శాఖ అధికారుల దాడులు

యాడికి, న్యూస్‌టుడే: యాడికి పట్టణంలో ఆదివారం తూనికలు, కొలతల శాఖ అధికారులు పలు దుకాణాలపై దాడులు చేశారు. లీగల్ మెట్రాలాజీ ఇన్‌స్పెక్టర్ శంకర్ పలు దుకాణాల్లోని త్రాసులు, ఏంఆర్‌పీ తదితర వాటిని పరిశీలించారు. శ్రావ్యా మాల్, కేదర్ ట్రెడర్స్‌లలో నిబంధనలు పాటించకపోవడంతో రూ.25 వేలు జరిమానా విధించి, వారిపై కేసు నమెదు చేసినట్లు శంకర్ చెప్పారు.

క్రీడాకారుడికి ఆర్థిక సాయం

గార్లదిన్నె గ్రామీణం, న్యూస్‌టుడే: కల్లూరు గ్రామానికి చెందిన రాజశేఖర్ ఇండో నేపాల్ టెన్నిస్ క్రికెట్ టోర్నీ ఎంపికయ్యారు. ఈవిషయం తెలుసుకున్న శింగనమల నియోజకవర్గ తెదేపా ద్విసభ్య కమిటీ సభ్యుడు ముంటిమడుగు కేశవరెడ్డి తనవంతుగా రూ.10వేలు ఆర్థిక సాయాన్ని తెదేపా నాయకుడు సుధాకర్ రెడ్డి చేతుల మీదుగా అందజేశారు.

కొండాపురంలో పోలీసుల సోదాలు

పామిడి: కొండాపురం గ్రామంలో ఆదివారం సీఐ యుగంధర్ నాకాబందీ నిర్వహించారు. అనంతరం వాహనాలను తనిఖీ చేశారు. గ్రామంలోని వీధుల్లో పర్యటించి అనుమానాస్పద వ్యక్తుల ఇళ్లల్లో సోదాలు నిర్వహించారు. అనంతరం గ్రామస్థులతో సమావేశమై ట్రాఫిక్ నిబంధనలు, శిరస్త్రణం ధరించడం వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు.

అధ్వానంగా ఉన్న ధర్మావరం రహదారి

రెండు కి.మీ.ల దారి.. గుంతలతో నిండి

గుత్తి గ్రామీణం, న్యూస్‌టుడే: గుత్తి మండలంలోని ధర్మావరానికి చెందిన రహదారి అధ్వానంగా ఉంది. దీన్ని 30 ఏళ్ల కిందట వేశారు. ఈమార్గం గుండా ధర్మావరం, యంగన్నపల్లి, బేతాపల్లి, ఊటకల్లు గ్రామాలకు వెళ్లడానికి అనువుగా ఉంటుంది. దాదాపు నాలుగేళ్ల కిందటి నుంచి రహదారి మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో ఆయా గ్రామాలకు వెళ్లే ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. అత్యవసర సమయాల్లో పరిస్థితి దారుణంగా ఉంటోంది. ధర్మావరం గ్రామానికి చెందిన వారు రెండేళ్లుగా ప్రజాప్రతినిధుల చుట్టూ తిరుగుతూ సమస్యను విన్నవిస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదని స్థానికులు వాపోతున్నారు. కనీసం గుంతల్లో మట్టిని నింపి తాత్కాలికంగా సమస్యను పరిష్కరించమని కోరుతున్నా అతీగతీ లేదని వారు ఆరోపిస్తున్నారు. గుత్తి సమీపంలోని ఎన్‌టీపీ నుంచి ధర్మావరం వరకు దాదాపు రెండు కి.మీ. వరకు రహదారి దారుణంగా ఉంది. వర్షాలు పడిన ప్రతిసారి గుంతల్లో నీళ్లు నిలబడి ప్రమాదాలకు కారణమవుతోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి పంపిణీ

శింగనమల, న్యూస్‌టుడే: తెదేపా ప్రభుత్వం పేదలకు నిరంతరం పేదలకు అండగా ఉంటుందని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు పంపిణీ చేశారు. పుట్లూరు మండలం అరకటిమేముల గ్రామానికి చెందిన రాజ కుటుంబానికి రూ. 71,671, బాలాపురం గ్రామానికి చెందిన ప్రసాద్‌నాయుడు కుటుంబానికి రూ. 1.19లక్షలు సాయం చేశారు.

★ బుక్కరాయసముద్రం మండలం జనచైతన్య కాలనీకి చెందిన విద్యార్థులకు ఎమ్మెల్యే శ్రావణిశ్రీ చదువుకు భరోసా కల్పించారు. ఈనెల 26వ తేదీన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో సునీత, సంతోషిలు ఆర్థిక ఇబ్బందులతో చదువులు సాగించ లేక పోతున్నామని ఎమ్మెల్యేకు విన్నవించారు. దీనికి ఎమ్మెల్యే విద్యార్థులకు విద్యా సామగ్రి అందించారు. విద్యార్థుల చదువుకు అవసరమైన సాయం చేస్తానని భరోసా ఇచ్చారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

'హిందువుల మనోభావాలు దెబ్బతీశారు'

ర్యాలీలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే మధుసూదన్

గుంతకల్లు, న్యూస్‌టుడే : వైకాపా ప్రభుత్వం తిరుమలలో లడ్డూను కల్తీచేసి హిందువుల మనోభావాలను దెబ్బతీసిందని జనసేన నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ అన్నారు. లడ్డూను కల్తీ చేసినందుకు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ హిందూ సనాతన ధర్మపరిరక్షణకు చేస్తున్న దీక్షకు మద్దతుగా ఆదివారం జనసేన, భాజపా, యువమోర్చా ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యేతో పాటు జనసేన నాయకుడు పూలరమణ, యువమోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి మంజులా వెంకటేశ్ మాట్లాడారు. వైకాపా ప్రభుత్వంలో ఎన్నో అన్యాయాలు జరిగాయని, చివరకు భక్తులకు అందించే లడ్డూ విషయంలోనూ కక్కుర్తి పడడం చాలా బాధాకరమైన విషయమన్నారు. భాజపా తప్పా ఇతర పార్టీలు హిందువుల ఆందోళనకు సహకారం అందించడంలేదని విమర్శించారు. భాజపా, విశ్వహిందూ పరిషత్ నాయకులు, హిందువులకు సంబంధించిన వివిధ ధార్మిక సంస్థల ప్రతినిధులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ర్యాలీని బీరప్ప ఆలయం నుంచి కోదండరామస్వామి ఆలయం వరకు నిర్వహించారు.

పట్టాలెక్కనున్న జల్‌జీవన్ పథకం

గ్రామీణులకు తీరనున్న తాగునీటి సమస్య

మామిళ్లచెరువులోని నీటి పథకం

గుత్తి, తాడిపత్రి, శింగనమల, న్యూస్‌టుడే: ఇన్నాళ్లు నిలిచిపోయిన జల్‌జీవన్ పనులు ఇకపై పరుగులు పెట్టనున్నాయి. గుంతకల్లు, తాడిపత్రి, శింగనమల నియోజకవర్గాలకు రెండేళ్ల కిందట జల్‌జీవన్ పనులు మంజూరయ్యాయి. అవి ఇప్పటికీ పూర్తి కాలేదు. గ్రామీణులు రక్షిత మంచినీటిని అరకొరగా పొందుతున్నారు. ప్రస్తుతం ఉన్న నీటి పథకాలు ప్రజలకు అవసరమైనంత నీరు అందించలేకపోతున్నాయి. పథకం కింద మొదటి దశపనులు అరకొరగా పూర్తయ్యాయి. రెండోదశలో మంజూరైన ననులు నేటికీ పూర్తి కాలేదు.

సీఎం సమీక్షతో చిగురించిన ఆశలు

జల్‌జీవన్ పనులపై వారం కిందట సీఎం చంద్రబాబునాయుడు ఉన్నతాధికారులతో సమీక్షించారు. జల్‌జీవన్ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనులను పరుగులు పెట్టించాలని, రాబోయే మూడేళ్లల్లో ప్రతి ఇంటికి కుళాయి కనెక్షన్ ఇవ్వాలని ఆదేశించారు.

గత ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే...

గత వైకాపా ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే జల్‌జీవన్ పనులు పడకేశాయి. పనులు చేసేందుకు గుత్తేదారులు ముందుకు రావడంలేదని కమ్యూనిటీ కాంట్రాక్టు విధానం కింద పూర్తి చేయించాలని పాలకులు యోచించారు. స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలకు శిక్షణ కూడా 8 నెలల కిందట గ్రామీణ నీటిసరఫరా విభాగం ఇంజినీర్లు ఇచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిధులు వెచ్చించి పనులు పూర్తి చేయించాల్సిఉంది. రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి మ్యాచింగ్ గ్రాంటు ఇవ్వలేకపోయింది. దీంతో పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీర్లు పనులను మంజూరు చేశారేగానీ వాటి పూర్తికి నిధులులేక ఇబ్బందులు పడుతున్నారు.

ఆశగా ఎదురుచూపు

గుత్తి మండలంలోని కె. ఊచిచర్ల, ఊబిచర్ల, కరిడికొండ, వన్నేదొడ్డి, బసినేపల్లి తండా, ఆబ్చేదొడ్డి, బ్రాహ్మణపల్లి, తురకపల్లి, జక్కలచెరువు, గొందిపల్లి, తొండపాడు, గుంతకల్లు మండలంలోని ఓబుళాపురం, వైటీచెరువు, పాతకొత్తచెరువు తదితర గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొంది. జల్‌జీవన్ పనులు పూర్తి చేసి తమ దాహార్తిని తీర్చాలని ప్రజలు ఇప్పటికీ ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

(c) eenadu

అనంతపురం

• అనంతపురం • రాప్తాడు

చదరంగం ఆడుతున్న మహిళా ఉపాధ్యాయులు

ఉపాధ్యాయులకు ఆటవిడుపు

అనంతపురం విద్య: యూటీఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు పూర్తి చేసుకొన్న సందర్భంగా క్రీడాపోటీలు నిర్వహించారు. ఆదివారం ముగింపు పోటీలు జరిగాయి. స్థానిక శారదా నగరపాలకోన్నత పాఠశాలలో చదరంగం, క్యారమ్స్ పోటీలు నిర్వహించారు. మహిళా ఉపాధ్యాయులు పోటీల్లో పాల్గొన్నారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య మాట్లాడుతూ ఉపాధ్యాయుల శ్రేయస్సే పరమావధిగా యూటీఎఫ్ కృషి చేస్తోందన్నారు.

శుభ్రత చర్యలు.. విజ్ఞాన యాత్ర

ఉరవకొండ: పెన్నహోబిలం లక్ష్మీనరసింహ స్వామి ఆలయ పరిసరాల్లో ఆదివారం అనంతపురం ప్రభుత్వ డిగ్రీ(ఆర్ట్స్) కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్, ఎన్సీసీ వాలంటీర్లు ఆలయ పరిసరాల్లో శుభ్రత చర్యలను చేపట్టారు. ప్లాస్టిక్ సంబంధ వస్తువులను శుభ్రం చేశారు. వాతావరణ కాలుష్యం ఏర్పడకుండా ఉండాలన్న ఉద్దేశంతో ఈ చర్యలను చేపట్టినట్లు ఎన్ఎస్ఎస్ పీవో విష్ణుప్రియ చెప్పారు. అనంతరం వారికి ఆలయ విశిష్టతను, దాని చరిత్రను ఉపాధ్యాయులు వివరించారు.

ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న అనంత ఆర్ట్స్ కళాశాల విద్యార్థులు

ఆలయ హుండీ లెక్కింపు

రాప్తాడు, న్యూస్‌టుడే: రాప్తాడు మండలం మరూరు గ్రామంలో వెలసిన చిన్న కదిరయ్యస్వామి హుండీ లెక్కింపు ఆదివారం నిర్వహించారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ విజయకుమారి, సీఐ హర్ష ఆధ్వర్యంలో హుండీ లెక్కించగా రూ.7,82,000 ఉన్నట్లు ఆలయ పూజారులు తెలిపారు. యథావిధిగా ప్రతి శనివారం ఆలయంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపడతామని తెలిపారు. గ్రామస్థులు, గుడికాపరులు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

మదరసా ప్రారంభం

అనంత నగరపాలక, న్యూస్‌టుడే: ఖురాన్ పఠనం దైవకార్యంగా భావించాలని మేయర్ వసీం తెలిపారు. ఆదివారం గుల్జార్‌పేటలో మదరసాను ప్రారంభించారు. కార్యక్రమానికి ఆల్ ఇండియా జమీయల్ ఉలేమాయే హింద్ ప్రధాన కార్యదర్శి ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త హజరత్ ముప్తి సయ్యద్ మాసూమ్ సాఖిబ్ హాజరయ్యారు.

ఆంగ్ల నవలలపై పరిశోధన

ఎస్కేయూ, న్యూస్‌టుడే: ఆంగ్లభాషా రచయితలు కిరణ్ దేశాయ్, ఝుంపాలాహిరి, అనిత రావు బాదమి రాసిన నవలలు అందులోని కుటుంబ సంబంధాలపై అనంత నగరానికి చెందిన కవిత పరిశోధన చేశారు. ఆమె ప్రస్తుతం కళ్యాణదుర్గంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. తిరుపతిలోని పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆచార్యురాలు నీరజ పర్యవేక్షణలో పరిశోధన చేశారు. ఆమె పరిశోధనలకు డాక్టరేట్ ప్రదానం చేశారు.

తెరపై ఈనాడు

కమలానగర్, న్యూస్‌టుడే : గంగ : **సత్యం సుందరం,** గౌరి, గాయత్రి, గౌతమి, త్రివేణి, తరంగిణి, ఎస్వీ సినిమాక్స్, నీలిమ, సుధా : **దేవర,** తేజస్విని : **మత్తువదలరా-2.**

యార్డులో నీటి తొట్టెల వద్ద ధ్వంసమైన కాలువ

మూడో గేటు నీటిశుద్ధ కేంద్రం వద్ద అపరిశుభ్రత

పశువుల సంత దారిలో కదలని మురుగు

అపరిశుభ్రంగా అనంత మార్కెట్ యార్డు

అనంతపురం (వ్యవసాయం), న్యూస్‌టుడే: అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులోని మురుగునీటి కాలువలు ధ్వంసమయ్యాయి. కాలవంతా అస్తవ్యస్తంగా ఉంది. యార్డులోని మూడో గేటు నుంచి పశువులు, గొర్రెల సంతలో ప్రధాన రహదారికి పొడువునా మురుగు కాలువ నిర్మించారు. గుత్తి జాతీయ రహదారికి ఇరువైపుల పెద్ద కాలువను నిర్మించారు. యార్డులోని మురుగు కాలువను గుత్తి రోడ్డుకున్న పెద్ద కాలువలోకి అనుసంధానం చేయలేదు. కాలువలోనే మురుగు ముందుకు కదలడంలేదు. రంగుమారి దుర్వాసన వస్తోంది. యార్డులో మురుగు కాలువపై వేసిన సిమెంటు మూతలన్నీ కాలువలోకి ఒరిగిపోయాయి. మురుగు పారకుండా అడ్డంగా మారాయి. కొన్నేళ్ల నుంచి ఇలాగే ఉంది. పశువులకు 10 నీటి తొట్టెలు నిర్మించారు. తొట్టెల్లోకి పైపులు వేసి నీటిని వదులుతున్నారు. పైపులకు కొళాయిల్లేవు. తొట్టెల్లో నీరు నిండిపోయి బయటకు పారుతోంది. యార్డు అధికారులు పట్టించుకోకుండా వదిలేశారు.

నీటి శుద్ధి కేంద్రాల వద్ద

అనంత యార్డులో రెండు నీటిశుద్ధి కేంద్రాలున్నాయి. పండ్ల మార్కెట్‌కు ఒకటి, గొర్రెలు, పశువుల సంతల్లో రైతులకు, వ్యాపారులకు, కాపర్లకు ఒకటి చొప్పున నిర్మించారు. పండ్ల మార్కెట్ వద్దనున్న నీటిశుద్ధి కేంద్రం వృథా నీరంతా పశువుల మార్కెట్ ప్రధాన రహదారిపైకి వదులుతున్నారు. సీసీ రహదారిపైన నిత్యం నీరుపారి పచ్చగా పాచిపట్టింది. సంతల్లో అటుఇటు తిరిగేవారంతా జారిపడాల్సి వస్తోంది. మూడో గేటు లోపల భాగంలో ఉన్న నీటిశుద్ధి కేంద్రం వద్ద అంతా అపరిశుభ్రంగా ఉంది. కేంద్రం అనుకుని వెనకవైపు అధ్వానంగా మారి దుర్వాసన భరించలేక శుద్ధినీరు నీరు తాగలేని పరిస్థితి ఉందని రైతులు వాపోతున్నారు. ఇప్పటికైనా నీటిశుద్ధి కేంద్రాల వద్ద శుభ్రంగా ఉంచాలని సంతలకు వచ్చే రైతులంతా కోరుతున్నారు. యార్డు ఎంపి కార్యదర్శి గోవిందు దృష్టికి తీసుకెళ్లగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మేమున్నాం.. మీకు తోడుగా

(10 AM to 1 PM)

అనంత నగరపాలక: 8008573011, రూరల్: 8008573010, రుద్రంపేట: 9989195979, ఎస్కేయూ: 8008573005, రాప్తాడు: 6304766286, ఆత్మకూరు: 7995067003

సమస్య : రెండో రోడ్డులో చెత్త కుండీ రోడ్డుకు అడ్డంగా ఉంది. కార్మికులు చెత్తను తరలించే క్రమంలో చెత్త కుండీని రోడ్డు మధ్యలో ఉంచి వెళుతున్నారు. వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. చెత్త కుండీని సక్రమంగా ఉంచండి. **- శంకర్, స్థానికుడు.**

సమాధానం : వెంటనే సమస్యను పరిష్కరిస్తాం **: విష్ణుమూర్తి, ఎంహెచ్ఓ - న్యూస్‌టుడే, కమలానగర్**

సమస్య: నగరంలో సరోజినీ రోడ్డును ఆక్రమించారు. మురుగు కాలువల మీద కట్టేయడంతో మురుగు ముందుకు కదలక దుర్వాసన వస్తోంది. **- సంపత్‌కుమార్**

సమాధానం: పరిశీలించి తగు చర్యలు తీసుకుంటాం.

సమస్య: అశోక్‌నగర్‌లో విద్యుత్తు స్తంభం నంబరు ఎ6/6ఎ సమీపంలో తీగల మీదకు చెట్టు కొమ్మలు ఉండటంతో ప్రమాదకరంగా ఉంది. **- ఆనంద్**

సమాధానం: అడ్డంగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగిస్తాం

- పై ప్రశ్నలకు నగరపాలక ప్రజారోగ్య అధికారి విష్ణుమూర్తి, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు సమాధానాలు ఇచ్చారు

- న్యూస్‌టుడే, అనంత నగరపాలక

రోడ్డుకు అడ్డంగా ఉన్న చెత్త కుండీ

కొత్తూరులో శరన్నవ రాత్రులకు ఏర్పాట్లు పూర్తి

నవరాత్రి ఉత్సవాల సావనీరు ఆవిష్కరిస్తున్న కొత్తూరు ఆర్యవైశ్య సంఘం పాలకవర్గం

అనంత సాంస్కృతికం: అనంతపురం నగరం కొత్తూరు వాసవీ కన్యకాపరమేశ్వరి దేవికి స్వస్తిశ్రీ క్రోధి నామ సంవత్సరాన్ని పురస్కరించుకొని శరన్నవ రాత్రుల ఉత్సవాలు కన్నుల పండువగా నిర్వహించబోతున్నామని కొత్తూరు ఆర్యవైశ్య సంఘం పాలకవర్గం అధ్యక్షుడు గోపా మచ్చా నరసింహులు వెల్లడించారు. ఆదివారం అనంతపురం కొత్తూరు కన్యకాపరమేశ్వరి ఆలయంలో పాలక వర్గంతో కలిసి ఉత్సవాలకు సంబంధించిన సావనీరు ఆవిష్కరించారు. అందులో సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన సేవా కార్యక్రమాలు ఉత్సవాలకు సంబంధించిన పలు అంశాలు క్రోడీకరించారు. ఈ సంవత్సరం బంగారంతో అమ్మవారికి అలంకారం ఉంటుందన్నారు. అక్టోబరు 3 నుంచి 13 వరకు రోజుకో అలంకారంతో అమ్మవారి మూల విగ్రహం తోపాటు ఉత్సవ విగ్రహాన్ని అలంకరించనున్నారు. ప్రధాన కార్యదర్శి మిట్టా ఆంజనేయులు, కార్యదర్శి టంగుటూరు నాగభూషణ, కార్యవర్గ సభ్యుడు మురళీకృష్ణ పాల్గొన్నారు.

వేదగాయత్రీ దేవి ఉత్సవాలకు ఆలయం ముస్తాబు

తపోవనం (అనంత గ్రామీణం), న్యూస్‌టుడే: అనంతపురం గ్రామీణ మండలం తపోవనంలో వెలసిన శ్రీ వేదగాయత్రీ అమ్మవారి శరన్నవరాత్రి ఉత్సవాలు ఈసారి వైభవంగా నిర్వహిస్తామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఉత్సవాలు వచ్చే నెల 3న ప్రారంభమై 12 వరకు వివిధ అలంకారాల్లో అమ్మవారు దర్శనమిస్తారని తెలిపారు. ఆయా రోజుల్లో ఏదో ఒక ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. అక్టోబరు 3న దుర్గా సప్తశతి పారాయణం నిర్వహిస్తామన్నారు. గౌరీదేవి, మహాలక్ష్మిదేవి, అన్నపూర్ణదేవి, బాలాత్రిపురసుందరీదేవి, లలితాదేవి, దాక్షాయణీదేవి, సరస్వతీదేవి, రాజరాజేశ్వరిదేవి, దుర్గాదేవి, గాయత్రీదేవి అలంకారాల్లో అమ్మవారు దర్శనమిస్తారని వారు వివరించారు. వచ్చే నెల 9న అక్షరాభ్యాసం, లక్ష్మీ గణపతి మూలమంత్రహోమాలు జరుగుతాయన్నారు. 10న నవగ్రహ, రుద్రస్వాహాకార ధన్వంతరీ, మృత్యుంజయ, మన్యుసూక్త హోమాలు నిర్వహిస్తామన్నారు. 11న దుర్గాష్టమి రోజున చండీహోమం, ఆయుష్యాది హోమాలు, మహాపూర్ణాహుతి, చిన్నారులకు కుమారి పూజ జరుగుతుందన్నారు.

వేదగాయత్రీ దేవాలయ లోగో ఆవిష్కరిస్తున్న సభ్యులు

చెత్తకుండీ.. ఉపయోగించండి!

అనంత నగరంలోని కొన్ని ప్రాంతాల్లో చెత్త కుండీలు లేక చెత్తా చెదారం రోడ్డుపై పడేయటం మామూలైపోయింది. చెత్త కుండీలున్నా వాటిని ఉపయోగించడం మానేశారు. గతంలో సిమెంట్ తొట్టెలను చెత్త కుండీలుగా ఏర్పాటు చేసి అందులోని చెత్తను తరలించేవారు. రాను రాను ఆ తొట్టెలు ధ్వంసం కావటంతో ఇనుప డబ్బాలను ఉపయోగిస్తున్నారు. రెండో రోడ్డులో స్టడీ పార్కు వద్ద సిమెంట్ తొట్టె ఆకారంలో ఉన్న చెత్త కుండీ ఉన్నా అక్కడ చెత్త వేయటంలేదు. ఇలాంటివి నగరంలో చాలాచోట్ల వృథాగా పడివున్నా అధికారులు పట్టించుకోవట్లేదు.

- న్యూస్‌టుడే, అనంతపురం(బళ్లారిరోడ్డు)

అరుస్తూ... వెంటాడుతూ..

నగరంలో రోజురోజుకూ శునకాల బెడద తీవ్రం అవుతోంది పలు కాలనీల్లో శునకాలు గుంపులుగా సంచరిస్తు ప్రజలపై దాడులు చేస్తున్నాయి. అశోక్‌నగర్ పరిశర ప్రాంతాల్లో నిత్యం వందల సంఖ్యలో శునకాలు ప్రజలకు భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. వాహనదారులపైకి వస్తు ప్రమాదాలకు కారణమవుతున్నాయి. పిల్లలు పాఠశాలలకు వెళ్లే సందర్భంలో వీటిని చూసి వణికిపోతున్నారు. కొన్ని సార్లు పిల్లలను కుక్కలు వెంటాడుతున్నాయి. వాహనాల వెంటపడి ప్రజలను కరుస్తున్నాయి.

- న్యూస్‌టుడే, అనంతపురం (కమలానగర్)

రోడ్డుపై కంకరతో ఇబ్బందులు

అనంతపురం నుంచి కదిరికి వెళ్లే జాతీయ రహదారిపై శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీ బ్రిడ్జిపై రోడ్డుకిరువైపులా మట్టి, కంకర ఉండటంతో అటువైపు వెళ్లే ద్విచక్ర వాహనాలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ రహదారిపై ఇసుక టిప్పర్లు, కంకర టిప్పర్లు నిత్యం జిల్లా కేంద్రానికి తరలివస్తుంటాయి. ఈ క్రమంలో టిప్పర్ల నుంచి జారిపడిన ఇసుక, కంకర రోడ్డుపక్కకు చేరడంతో ద్విచక్ర వాహనదారులు జారిపడుతున్నారు. బ్రిడ్జిపై ఉన్న మట్టి, కంకరను అధికారులు స్పందించి తొలగిస్తే ప్రమాదాలు జరగకుండా ఉంటాయని వాహనదారులు కోరుతున్నారు. **- న్యూస్‌టుడే, రాప్తాడు**

ఇళ్ల ముందు మురుగుతో ఇక్కట్లు

రుద్రంపేట పంచాయతీ పరిధి యాదవ కల్యాణ మంటపం వెనుక కాలువలు స్తంభించి ఇళ్ల ముందు మురుగు ప్రవహిస్తోంది. రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు తెలిపారు. రోజులు తరబడి కాలువలు శుభ్రం చేయకపోవడంతో మురుగు రోడ్డు పైకి చేరుతోందని స్థానికులు చెబుతున్నారు. అధికారులు స్పందించి మురుగునీటి కాలువలు శుభ్రం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- న్యూస్‌టుడే, రుద్రంపేట

తెదేపాతోనే బీసీల అభ్యున్నతి

అనంతపురం (కళ్యాణదుర్గంరోడ్డు), న్యూస్‌టుడే : బీసీలకు అభ్యున్నతి తెదేపా ప్రధాన ఉద్దేశమని రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. ఆదివారం అనంతపురం నగరంలోని స్వగృహంలో పద్మశాలి సంక్షేమ సంఘం నాయకులు ఎమ్మెల్యేకు శాలువా కప్పి సత్కరించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కష్టకాలంలో పనిచేసిన ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందన్నారు. పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర సభ్యుడిగా అనంతవాసిని ఎంపిక చేయడానికి సహకరించిన ఎమ్మెల్యేకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. పద్మశాలి సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ రాష్ట్ర సభ్యుడు లక్ష్మీనరసింహులు, సంఘం నాయకులు సత్యనారాయణ, మంజునాథ, విశ్వనాథ, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులును సన్మానిస్తున్న పద్మశాలి సంఘం నాయకులు

మట్టిపూలు పుస్తకం ఆవిష్కరిస్తున్న సాహితీ వేత్తలు

జీవిత మూలాలను వ్యక్తికరించేది కవిత్వ విమర్శ

అనంత సాంస్కృతికం,న్యూస్‌టుడే: జీవిత మూలాలను సూత్రప్రాయంగా వ్యక్తీకరించేది కవిత్వ విమర్శ అని పలువురు సాహితీ వేత్తలు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని ఉపాధ్యాయ భవనంలో తూము చెర్ల రాజారాం విమర్శనాత్మక గ్రంథం మట్టిపూలు పుస్తకం ఆవిష్కరణ సభ నిర్వహించారు. సభకు స్పందన అనంత కవుల వేదిక ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరశాస్త్రి మాట్లాడుతూ కవులు కవిత్వంలో వ్యక్తీకరించిన వేదనలను పుస్తకం రూపంలో ఇవ్వడం అభినందనీయం అన్నారు. సీమ కవుల కవితాంతరంగాన్ని మట్టిపూలుగా సృజించిన విమర్శకవి రాజారామ్ అభినందనీయుడన్నారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత బండి నారాయణస్వామి, సీనియర్ కవి రాధేయ, అధ్యాపకులు అంకే శ్రీనివాస్, డాక్టర్ శాంతినారాయణ, సురేష్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం నగర శివారులోని 44వ జాతీయ రహదారిపై జరిగిన ఆదివారం రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. ఆజాద్‌నగర్‌కు చెందిన శివ, చంద్రలు ద్విచక్ర వాహనంపై రాప్తాడు వైపు వెళ్తుండగా, స్థానిక కక్కలపల్లి మలుపు వద్ద హైవేపై అదుపు తప్పి బోల్తా పడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. గమనించిన తోటి ప్రయాణికులు క్షతగాత్రులను చికిత్స కోసం ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తరలించారు.

యాచకుడిపై దాడి

అనంత నేరవార్తలు, న్యూస్‌టుడే: అనంతపురం నగరం ఆర్టీసీ బస్టాండులో గుర్తుతెలియని వ్యక్తులు ఓ యాచకుడిపై దాడి చేసి గాయపరిచారు. బుక్కరాయసముద్రం మండలానికి చెందిన కొండన్న ఆర్టీసీ బస్టాండులో ఉంటూ యాచిస్తూ స్థానికంగానే తలదాచుకుంటాడు. ఆదివారం తెల్లవారుజామున బస్టాండులో టీ స్టాల్ వద్ద ఉండగా ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి అతనిపై కట్టెలతో దాడి చేసి పరారయ్యారు. గాయపడిన వృద్ధుడిని చికిత్స నిమిత్తం సర్వజన వైద్యశాలకు తరలించారు.

దీన స్థితిలో కూలీ కుటుంబం

రుద్రంపేట, న్యూస్‌టుడే: కూలి పనులు చేసుకొంటూ జీవనం సాగిస్తున్న ఆ ఇంట్లో రోడ్డు ప్రమాదం రూపంలో ఉపద్రవం వచ్చింది. కోర్టు రోడ్డు ఆంజనేయస్వామి దేవాలయం సమీపాన కూలి పనులు చేసుకుంటే మురళీ దంపతులు నివాసముంటున్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మురళీ కుడి కాలు విరిగి కదలలేని స్థితిలో మంచానికే పరిమితం కావడంతో కుటుంబం గడవటం భారమైంది. వాలని, వికలత్వం ధ్రువీకరణ పత్రం ఇప్పించి భర్తకు తోడుగా కూలి పనులకు వెళ్తున్న పింఛను ఇవ్వాలని వేడుకుంటోంది.

భార్య పనులు మానేసి ఆయనకు సపర్యలు చేస్తోంది. విరిగిన కాలు బాగు చేసేందుకు ఆసుపత్రుల చుట్టూ తిరిగి ఇప్పటి వరకు రూ.3 లక్షలు అప్పులు చేసి ఖర్చు చేసినా.., దీన స్థితితో ఆ కుటుంబం కొట్టుమిట్టాడుతోంది. ఇప్పటికీ కాలు కోలుకోలేదని భార్య లక్ష్మీ తన బాధను చెప్పుకొచ్చింది. 8 నెలలుగా కుటుంబం గడవటం కష్టం మయిందని, దాతలు ఆదుకోవాలని, వికలత్వం ధ్రువీకరణ పత్రం ఇప్పించి భర్తకు తోడుగా కూలి పనులకు వెళ్తున్న పింఛను ఇవ్వాలని వేడుకుంటోంది.

విద్యుదాఘాతంతో రైతు దుర్మరణం

రాప్తాడు, న్యూస్‌టుడే: రాప్తాడు మండలం బోగినేపల్లి గ్రామానికి చెందిన రైతు చిరంజీవి (37) విద్యుదాఘాతానికి గురై ఆదివారం మృతి చెందాడు. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. బోగినేపల్లికి చెందిన చిన్నమాదన్న కుమారుడు చిరంజీవి వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవాడు. ఉదయం వర్షం కురిసిన అనంతరం తోటలోకి వెళ్లి మోటారు ఆన్‌చేసేందుకు స్టార్టర్ పెట్టె ముట్టుకోవడంతో అప్పటికే విద్యుత్తు సరఫరా అయి ఉండటంతో షాక్‌కు గురయ్యాడు. చుట్టుపక్కలవారు గమనించి చూసేసరికే మృతి చెంది ఉన్నట్లు తెలిపారు. మృతుడు అవివాహితుడు. చేతికొచ్చిన కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు తీవ్ర కన్నీటి పర్యంతమయ్యారు.

వంట గదిలో బోధన.. విద్యార్థులకు యాతన

ఆత్మకూరు: ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యాబుద్ధులు నేర్చుకోవాల్సిన విద్యార్థులు తీవ్ర ఆపోసోపాలు పడాల్సిన దుస్థితి. గత వైకాపా పాలనలో నాడు-నేడు పథకం ద్వారా పలు పాఠశాలలను అభివృద్ధి చేయాలని నిర్ణయించి పనులను పూర్తి చేయకపోవడంతో ఈ దుస్థితి దాపురించింది. చాలా పాఠశాలల్లో నిధులను సమకూర్చలేక మధ్యలోనే వదిలేశారు. పలు పాఠశాలలో నిధుల దుర్వినియోగం జరిగింది. పనులు పూర్తికాక విద్యార్థులు అనేక ఇబ్బందుల నడుమ పాఠాలను నేర్చుకుంటున్నారు.

కేజీబీవీ విద్యార్థులకూ తిప్పలే

మండల కేంద్ర కేజీబీవీ పాఠశాలలో మొత్తం 273 మంది విద్యార్థులు ఉన్నారు. అందులో 6 నుంచి 10వ తరగతి వరకూ 207 మంది విద్యార్థులు ఇంటర్‌లో 66మంది విద్యార్థులు ఉన్నారు. ఇంటర్ విద్యను 2018లో కొత్తగా ప్రారంభించారు. అయితే నాటి నుంచి విద్యార్థులకు తరగతులు నిర్వహించేందుకు గదులు లేక కంప్యూటర్ గది, స్టాఫ్ రూమ్‌లో నిర్వహించేవారు. కంప్యూటర్ గదిని ఖాళీ చేయాల్సి రాగా ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులను భోజన గదిలోకి మార్చారు. డిజిటల్ తరగతులు అన్నింటికి కలిపి వంట గదికి ఆనుసంధానం అయి ఉన్న భోజన గదిలో పాఠాలను బోధిస్తున్నారు. వంట చేసే సమయంలో ఘాటు వాసనతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. భోజన గదిలో భోజనం చేయకుండా వరండాలో చేయాల్సి వస్తోంది.

భోజన గదిలో నిర్వహిస్తున్న తరగతి గది

అసంపూర్తిగా ఇంటర్ గదుల నిర్మాణం

పాఠశాల ఆవరణంలో గత వైకాపా పాలనలో రూ.40లక్షలలో 4 గదుల నిర్మాణానికి 2022లో పనులు ప్రారంభించారు. రూ.13 లక్షలతో పనులు చేసి గత ఏడాది కాలంగా పనులు చేయకుండా వదిలేశారు. నిధులు లేక పనులను నిలిపివేయడంతో సమస్య నెలకొన్నది.

నిధులు వచ్చిన వెంటనే పనులు ప్రారంభం

గతంలో వచ్చిన నిధులతోనే పనులు ప్రారంభించి పిల్లర్ల వరకూ నిర్మాణం చేపట్టాం. 8 నెలలుగా నిధులు రాకపోవడంతో పనులు ఆగిపోయాయి. విద్యార్థులు పడుతున్న సమస్యను ఉన్నతాధికారులకు తెలియజేస్తాం. నిధులు వచ్చిన వెంటనే గదుల నిర్మాణాన్ని పూర్తి చేస్తాం. **- నరసింహారెడ్డి, ఎంఈవో ఆత్మకూరు**

అల్లుకున్న తీగలు.. గాలి వీస్తే నిప్పురవ్వలు

నగరంలోని అరవిందనగర్ చర్చికు వెళ్లే దారిలో నియంత్రికకు తీగలు ప్రమాదంగా అల్లుకున్నాయి. నిత్యం వందల సంఖ్యలో వాహనదారులు ఈ దారిలోనే రాకపోకలు సాగిస్తుంటారు. నియంత్రికకు అల్లుకున్న తీగల కారణంగా తరచూ విద్యుత్తు అంతరాయం ఏర్పడుతోందని కాలనీ ప్రజలు చెబుతున్నారు. వర్షం, పెద్దగా గాలీ వీచే సమయాల్లో నియంత్రిక నుంచి నిప్పురవ్వలు వస్తున్నాయన్నారు.

- న్యూస్‌టుడే, గుల్జార్‌పేట

'ప్రిన్సిపల్‌ను సస్పెండ్ చేయాల్సిందే'

బుక్కరాయసముద్రం, న్యూస్‌టుడే: కొర్రపాడు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్న విజయలక్ష్మిని వెంటనే సస్పెండ్ చేయాలని కేవీపీఎస్, ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండు చేశారు. ఆదివారం కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప మాట్లాడుతూ అవినీతి అక్రమాలకు పాల్పడుతున్న కొర్రపాడు గురుకుల పాఠశాల ప్రిన్సిపల్, ఆమెను ప్రోత్సహిస్తున్న డీసీవో మురళీకృష్ణను తక్షణమే సస్పెండ్ చేయాలన్నారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

అనంతపురం(రైల్వే), న్యూస్‌టుడే: అనంతపురం రైల్వేస్టేషన్‌లో పట్టాలు దాటుతుండగా గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఆయన వయసు 50 ఏళ్లు ఉంటాయని రైల్వే పోలీసులు పేర్కొన్నారు. గుర్తు తెలియని రైలు ఢీ కొనడంతో తలకు తీవ్రంగా గాయమై మృతి చెందాడు. మృతుడు తెలుపు రంగు చొక్కా, ఆకు పచ్చని రంగు లుంగీ, తెలుపు రంగు తువ్వాల్ ధరించినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి బంధువులు పూర్తి వివరాల కోసం అనంతపురం రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు.

(c) eenadu